ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 138, పేజీలు - 08

శుక్రవారం, నవంబర్ 20, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

రేషన్ కార్డు లేకపోయినా రూ.5 లక్షల బీమా

- ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభించిన సీఎం రేవంత్



- ప్రతి అర్హత గల కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత జీవిత బీమా - దరఖాస్తుకు రేషన్ కార్డు తప్పనిసరి కాదని ప్రభుత్వం వెల్లడి

- డిసెంబర్ 18 వరకు పంచాయతీలు, వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు - చేనేత కార్మికులు, మత్స్యకారుల బీమా పరిహారం రూ.5 లక్షలకు పెంపు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 2029 ఎన్నికల్లో తెలంగాణతో పాటు సిద్దిపేటలోనూ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీతో తనకు ఎప్పుడో తెగదెంపులు అయ్యాయని తేల్చి చెప్పారు. తెలంగాణకు అన్యాయం చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కృష్ణా జలాల వాటా, రాయలసీమ ప్రాజెక్టు, కాళేశ్వరం నిర్మాణం, బీఆర్ఎస్ కుటుంబ ఆస్తులపై పలు ఆరోపణలు చేశారు. ఇదే పర్యటనలో రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు. సిద్దిపేటలో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.సిద్దిపేటలో కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ బలాన్ని నిరూపించారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని, 2029 ఎన్నికల్లో రాష్ట్రంతో పాటు సిద్దిపేటలోనూ కాంగ్రెస్ విజయం



సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రజలు కోరుకున్న నాయకుడికే కాంగ్రెస్ టికెట్ ఇస్తానని ఆ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత సిద్దిపేట ప్రజలదేనని అన్నారు.

2లో..

టాక్స్ తగ్గించాం

మరి జీతాలు పెంచారా.?

- భారత పారిశ్రామికవేత్తలకు ప్రధాని సూటి ప్రశ్న



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కార్పొరేట్ పన్నుల తగ్గింపు, పలు ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వం ఇచ్చిన రాయితీలతో పరిశ్రమలు ఎంతమందికి కొత్తగా ఉపాధి కల్పించాయి? ఉద్యోగుల వేతనాలను ఎంతమేర పెంచాయి? అంటూ భారత పారిశ్రామిక రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సూటిగా ప్రశ్నించారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పన్నుల తగ్గింపు, నిబంధనల సరళీకరణ, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వంటి ఎన్నో చర్యలు తీసుకుందని ప్రధాని గుర్తుచేశారు. ఆ ఫలాలను ఉద్యోగాల సృష్టి, మెరుగైన వేతనాల రూపంలో ప్రజలకు అందించాల్సిన బాధ్యత పరిశ్రమలపైనే ఉందని స్పష్టం చేశారు. దేశ సర్వతోముఖాభివృద్ధి కేవలం ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, పారిశ్రామికవేత్తలు సైతం ఈ ప్రగతి ప్రయాణంలో సమాన భాగస్వాములు కావాలని మోదీ పిలుపునిచ్చారు. భారత్ కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి సంస్థలే సొంతంగా నిర్దిష్ట వ్యూహాలను రూపొందించుకోవాలని సూచించారు. ప్రతిదానికీ ప్రభుత్వంపైనే

2లో..

రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

రెన్యువల్ సీఎం

- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ వ్యంగ్య వ్యాఖ్యలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు రెన్యువల్ సీఎం.. ఈఎంఐ కడితేనే రెన్యువల్ అవుతారని విమర్శించారు. అలాగే సీఎం శారీరక ఎత్తును ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై, సీఎం రేవంత్ రెడ్డిపై పలు వ్యాఖ్యలు చేశారు.



2లో..

హరీశ్ రావు అవినీతిపై

చర్యలేవి.?

- సీఎంఓకు పంపిన లేఖలు

'ఎక్స్'లో పంచుకున్న కవిత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన వేళ, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో హరీశ్ రావు

2లో..

ఏపీ అభివృద్ధికి మూడు ఎకనమిక్ రీజియన్లు

- విశాఖ, తిరుపతి, అమరావతి ప్రణాళికలపై సీఎం సమీక్ష

- సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ అభివృద్ధి

- గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి

- క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా అమరావతి రాజధాని

- సూర్యలంక, గండికోట ప్రాంతాలకు టూరిజం మాస్టర్ ప్లాన్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ సమగ్రాభివృద్ధి, భారీ ఎత్తున పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు విశాఖపట్నం, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్‌ల అభివృద్ధిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతిలో జరిగిన ఈ సమావేశంలో మూడు ఆర్థిక ప్రాంతాల్లో చేపట్టిన ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమల గ్రౌండింగ్ తదితర అంశాలపై అధికారులు సీఎంకి ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల వనరులు, అనుకూలతలకు అనుగుణంగా



ప్రత్యేక రంగాలను అభివృద్ధి చేసేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఉత్తరాంధ్రలో పోర్టులు, ఐటీ, డేటా సెంటర్లు, భారీ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తుండగా రాయలసీమలో సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ పరిశ్రమలకు పెద్దపీట వేస్తున్నారు. అలాగే అమరావతిలో క్వాంటం టెక్నాలజీ, ఐటీ, లాజిస్టిక్స్, పోర్టు ఆధారిత పరిశ్రమలు, అగ్రి వాల్యూ చైన్ రంగాల్లో అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

విశాఖ ఎకనమిక్ రీజియన్ - ఐటీ, టూరిజం హబ్

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో వివిధ శాఖల ఆధ్వర్యంలో 167 అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించగా, ప్రభుత్వం ఇప్పటికే 64 పనులను ప్రారంభించింది.

2లో..

మూడో దశ పంచాయతీ ఎన్నికల

నోటిఫికేషన్ విడుదల

- 21 నుంచి నామినేషన్లు, డిసెంబర్ 2న పోలింగ్

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడో విడత ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ విడతలో రాష్ట్రంలోని 25 జిల్లాలకు చెందిన వివిధ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని మండలాల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ 21వ తేదీన సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసులు జారీ చేసి, అదే రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. నవంబర్ 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుంది.నవంబర్ 24వ తేదీన ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. నవంబర్ 25వ తేదీన



2లో..

దేశాభివృద్ధికి కేంద్రం - రాష్ట్రం సమన్వయం అవసరం

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. నిర్దేశించిన లక్ష్యాల సాధనలో దేశం ప్రగతి సాధించడానికి తనవంతు కర్తవ్యంగా తెలంగాణ కూడా తోడ్పాటును అందిస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ హైటెక్స్‌లో 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ ఐఆర్‌సీ వార్షిక సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశ భద్రత, జాతీయ ప్రాధాన్యతలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమం వంటి విషయాల్లో రాజకీయాలకు తావు లేకుండా ఐక్యంగా పనిచేయాలని అన్నారు. రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేసి మిగిలిన సమయం దేశాభివృద్ధిపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డి నొక్కిచెప్పారు.

కేంద్రం తెలంగాణకు సహకరించాలి

తెలంగాణలో చేపట్టాల్సిన రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే అనేక సందర్భాల్లో అందించామని గుర్తుచేస్తూ వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం సైతం స్పష్టమైన విధానాలతో ముందుకు వెళుతోంది అని చెప్పుకొచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణ తనవంతుగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ముందుకు

2లో..

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ వ్యాఖ్యలను హైకమాండ్ నిశితంగా గమనిస్తోంది

- పార్టీలో ఒకే నిబంధనలు ఉంటాయన్న మహేశ్ గౌడ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ పరంగా అందరూ సమానమేనని, నేతలు ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సొంత పార్టీ తీరుపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. సదరు ఎమ్మెల్యేల ప్రకటనలను పార్టీ అధిష్ఠానం నిశితంగా గమనిస్తోందని మహేశ్ గౌడ్ తెలిపారు. తెలంగాణకు త్వరలో రానున్న కొత్త పార్టీ ఇన్‌ఛార్జ్ ఈ పరిణామాలను సమగ్రంగా పరిశీలిస్తారని చెప్పారు. కాంగ్రెస్ ఒక ప్రజాస్వామిక పార్టీ అని, దేనికైనా సరైన సమయం ఉంటుందని పేర్కొన్నారు. గతంలో కొండా సురేఖ వ్యవహారంలోనూ చర్యలకు ముందు పలు అవకాశాలు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇదే సమయంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి విషయంలో జరిగిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొత్త డ్రామాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అంగీకరించిందని, ఇప్పుడు కేంద్ర బలగాలు డ్యామ్‌ల వద్ద ఉండటానికి ఆ నిర్ణయాలే కారణమని పేర్కొన్నారు. దక్షిణ

2లో..

మాంసం దుకాణాలపై

టీజీ సేఫ్ కొరడా!

- అపరిశుభ్రత మధ్య మాంసం, చికెన్ విక్రయాలు

- 11 ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు, నోటీసులు

- ఈగలు, బొద్దింకలు, వ్యర్థాలతో అపరిశుభ్ర వాతావరణం

- నిబంధనలు పాటించకుంటే దుకాణాల మూసివేత తప్పదని హెచ్చరిక



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నగరంలో మాంసం, చికెన్ విక్రయ కేంద్రాల నిర్వహణలో పరిశుభ్రత ప్రమాణాలు గాలికొదిలేస్తున్న నిర్వాహకులపై టీజీ సేఫ్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మాంసం విక్రయ దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన 11 ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పలు కేంద్రాల్లో తీవ్ర అపరిశుభ్రత బయటపడింది. మాంసంపై పెద్ద సంఖ్యలో ఈగలు వాలడం, చికెన్ కటింగ్ అనంతరం వెలువడే వ్యర్థాలను నేలపైనే వదిలేయడం అధికారుల దృష్టికి వచ్చింది. మరికొన్ని దుకాణాల్లో బొద్దింకలు, ఇతర కీటకాలు సంచరిస్తుండటాన్ని గుర్తించారు. కనీస పరిశుభ్రత, శానిటేషన్ ప్రమాణాలు పాటించకుండానే మాంసం విక్రయాలు సాగిస్తున్న నిర్వాహకుల తీరుపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాంసం దుకాణాలకు షోకాజ్ నోటీసులు

మటన్‌ను ఎలాంటి కవరింగ్ లేకుండా బహిరంగంగా వేలాడదీసి విక్రయిస్తున్న తీరును అధికారులు గుర్తించారు. ఆహార భద్రతా నిబంధనలను

2లో..

రేషన్ కార్డు లేకపోయినా రూ.5 లక్షల బీమా

సిద్దిపేటలో కాంగ్రెస్ గెలిస్తే ఈ నియోజకవర్గానికి మంత్రి పదవి ఇస్తానని ప్రకటించారు. పట్టణ అభివృద్ధికి తమ ప్రభుత్వం సుమారు రూ.550 కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు.తెలుగుదేశం పార్టీతో తనకు సంబంధం ఉందంటూ వస్తున్న విమర్శలపై రేవంత్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. తనను ముఖ్యమంత్రిని చేసిన ప్రజలకు, తెలంగాణ నేలకు నేనెందుకు అన్యాయం చేస్తాను, టీడీపీతో ఏనాడో తెగదెంపులు చేసుకున్నా. నాకు ఆ పార్టీతో ఏం సంబంధం అని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది కేసీఆర్, హరీశ్‌రావు కాదా అని నిలదీశారు. అప్పటి ఏపీ సీఎం జగన్‌ను ప్రగతిభవన్‌కు పిలిచి విందు ఇచ్చి, రాయలసీమ ప్రాజెక్టు నిర్మించుకోవాలని ప్రోత్సహించింది కేసీఆరేనని ఆరోపించారు. కమీషన్ల కోసం రాయలసీమ ప్రాజెక్టుకు సహకరించారని విమర్శించారు. కేసీఆర్ గతంలో చేసిన వ్యాఖ్యలు, వ్యవహరించిన తీరును గుర్తు చేస్తూ తెలంగాణ ప్రయోజనాలకు తాను ఎప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.2004లో వార్డు మెంబర్‌గా కూడా గెలవని హరీశ్‌రావుకు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రి పదవి ఇచ్చారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. ఆ తర్వాత సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ లేకుండా చేయాలని హరీశ్‌రావు ప్రయత్నించారని ఆరోపించారు. హరీశ్‌రావును రాజకీయంగా ఆదరించిన సోలిపేట రామలింగారెడ్డి కుటుంబ పరిస్థితి, హరీశ్‌రావు కుటుంబ ఆస్తుల మధ్య తేడాను ప్రజలు గమనించాలని అన్నారు. హరీశ్‌రావు కుటుంబానికి వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. రంగనాయకసాగర్ సమీపంలో, కొండపోచమ్మసాగర్ వద్ద ఫామ్‌హౌస్‌లు ఎలా ఏర్పడ్డాయని కేసీఆర్, హరీశ్‌రావులను నిలదీశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని త్యాగాలు చేసిన అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే, కేసీఆర్ కుటుంబ సభ్యులకు పదవులు దక్కాయని విమర్శించారు.తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి తల్లికి పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తగిన గుర్తింపు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ తన కుమారుడు, కుమార్తె, అల్లుడు, బంధువులకు పదవులు ఇచ్చుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పన్నుల రూపంలో ప్రజల నుంచి రూ.20 లక్షల కోట్లు వసూలయ్యాయని ప్రాజెక్టుల పేరుతో మరో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ నిధులన్నీ ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. హరీశ్‌రావు ముందుండి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు 3 ఏళ్లకే కూలిపోయిందని విమర్శించారు.ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ అందుకే 2018లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత హరీశ్‌రావుకు కేసీఆర్ మంత్రి పదవి ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. పాలమూరు ప్రాజెక్టులను పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారని, కృష్ణా జలాల విషయంలోనూ తెలంగాణకు నష్టం జరిగిందని ఆరోపించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మదన్‌మోహన్‌ను సిద్దిపేట ప్రజలు గుర్తుంచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. ఆయన పేరును కనుమరుగు చేసేందుకు కేసీఆర్, హరీశ్‌రావు ప్రయత్నించారని ఆరోపించారు. సిద్దిపేట మెడికల్ కాలేజీకి మదన్‌మోహన్ పేరు పెట్టేలా త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తామని ప్రకటించారు.సిద్దిపేట పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రూపొందించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ పథకం కింద అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనున్నారు. ఇప్పటికే నేతన్నలు, గీత కార్మికులు, ఇతర కార్మికులు, మత్స్యకారులకు వివిధ శాఖల ద్వారా అందుతున్న రూ.2 లక్షల జీవిత బీమాను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి రూ.5 లక్షలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బీమా కోసం లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. పూర్తి ప్రీమియాన్ని ప్రభుత్వమే భరిస్తుంది.నేటితో ప్రారంభమైన ఈ పథకం డిసెంబర్ 18వ తేదీ వరకు నెల రోజులపాటు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆన్‌లైన్, ప్రత్యేక యాప్, ఇంటింటి సర్వే ద్వారా అర్హుల వివరాలు సేకరించనున్నారు. సీఎం పర్యటనలో భాగంగా సిద్దిపేట జిల్లాలో మొత్తం రూ.544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో రూ.451.13 కోట్లతో చేపట్టనున్న కొత్త పనులకు భూమిపూజ చేయగా, రూ.92.98 కోట్లతో పూర్తయిన భవనాలు, ఇతర వసతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా రేవంత్‌రెడ్డి వివరించారు.గత ప్రభుత్వాలు ప్రారంభించిన ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ తమ ప్రభుత్వం నిలిపివేయలేదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అదనంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. 2029లో మరోసారి గెలిచి 2034 వరకు ఇందిరమ్మ రాజ్యాన్ని కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

టాక్స్ తగ్గించాం

ఆధారపడవద్దని హితవు పలికారు. విదేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తులకే అత్యున్నత నాణ్యతను కేటాయిస్తూ 'ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ' పేరిట ప్రచారం చేయడంపై మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విదేశీ వినియోగదారులకు అందించే నాణ్యమైన వస్తువులనే భారతీయ పౌరులు కూడా పొందే హక్కు కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. దేశీయ మార్కెట్‌ను తేలిగ్గా తీసుకోవద్దని హితవు పలికారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయాలని ప్రధాని కోరారు. ప్రపంచానికే ఫార్మసీ హబ్ గా పేరుగాంచిన భారత్ కీలకమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ), ముడి పదార్థాల కోసం ఇతర దేశాలపై బిలియన్ల డాలర్లు వెచ్చించాల్సి రావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమృద్ధిగా ముడి వనరులు ఉన్నప్పటికీ అల్యూమినియం, స్టీల్ రంగాల్లో ప్రత్యేక ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం తగదన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో భారత ఎగుమతుల వాటా కేవలం 2 నుంచి 2.5 శాతానికే పరిమితం కావడంపై దృష్టి సారించాలని, గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వర్గాలకు సూచించారు.

ఏపీ అభివృద్ధికి మూడు ఎకనమిక్ రీజియన్లు

ఈ రీజియన్‌కు 'వైజాగ్ బే సిటీ' యాంకర్ ప్రాజెక్టుగా నిలవనుంది. మధురవాడ, కాపులుప్పాడ, ఆనందపురం ప్రాంతాలను ఐటీ, డేటా సెంటర్ హబ్‌లుగా తీర్చిదిద్దనున్నారు. విశాఖలో 15 నుంచి 20 కొత్త ఐటీ సంస్థలను ఆకర్షించడంతో పాటు, ఇప్పటికే ఉన్న సంస్థల ద్వారా 2 లక్షల ఉద్యోగాల హామీని కార్యరూపంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీంతో పాటు విశాఖలో స్టీల్ సిటీ, కాకినాడ ఇండస్ట్రియల్ సిటీ, పోర్టుల విస్తరణకు ప్రణాళికలు రచించారు. తీర ప్రాంత అభివృద్ధి, కోనసీమ బ్యాక్ వాటర్స్‌తో పాటు అరకు, మారేడుమిల్లి వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో ఎకో టూరిజం ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు.

తిరుపతి ఎకనమిక్ రీజియన్- గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాలు

తిరుపతి ఎకనమిక్ రీజియన్‌ను అగ్రి ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, స్పేస్, ఎయిర్ క్రాఫ్ట్, ఆటో, ఈవీ, డిఫెన్స్, టూరిజం, నాలెడ్జ్ రంగాలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 87 గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఏకంగా 66 ప్రాజెక్టుల పెట్టుబడులు టీఈఆర్ పరిధిలోనే రావడం విశేషం. ఈ రీజియన్ పరిధిలోని 14 పట్టణాలను వివిధ రంగాల వారీగా ప్రత్యేక పారిశ్రామిక నగరాలుగా తీర్చిదిద్దాలని అధికారులు ప్రతిపాదించారు. అలాగే హార్టికల్చర్ హబ్‌లో భాగంగా డెయిరీ ప్రాసెసింగ్, మీట్ అండ్ పౌల్ట్రీ, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, టెర్మినల్ మార్కెట్లు వంటి ఆధునిక క్లస్టర్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

అమరావతి ఎకనమిక్ రీజియన్ - రూ. 4.65 లక్షల కోట్ల పెట్టుబడులు

రాజధాని అమరావతి ఆర్థిక ప్రాంతంలో 48 ప్రధాన ప్రాజెక్టుల ద్వారా ఏకంగా రూ. 4.65 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను గ్రౌండింగ్ చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, తద్వారా ఎగుమతులు, పారిశ్రామిక అభివృద్ధి మరియు లాజిస్టిక్స్ రంగానికి ఊతమివ్వాలని నిర్ణయించారు. కోస్టల్ టూరిజం అభివృద్ధిలో భాగంగా సూర్యలంక, ఓడరేవు, రామాపురం, చినగంజాం, నిజాంపట్నం, దిండి ప్రాంతాలను ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించారు.

మండి బిర్యాని తిని తొమ్మిదిమందికి అస్వస్థత

హైదరాబాద్అంబర్‌పేటలోని ముక్రం హోటల్‌లో మండీ బిర్యాని తిన్న ఓ కుటుంబంలోని తొమ్మది మంది ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంబర్‌పేటలో నివాసం ఉండే ఓ కుటుంబం ఈ నెల 15న గాంధీ?మ్మ సమీపంలోని ముక్రమ్ బిర్యానీ హోటల్‌లో మండీ బిర్యాని తెప్పించుకుని బంధువులతో కలిసి తిన్నారు. కొద్దిసేపటికి వారిలో తొమ్మిది మంది వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హోటల్ యజమానిని నిలదీయడంతో స్థానికంగా ఓ ఆసుపత్రిలో వారికి చికిత్సలు చేయించారు. కాగా అస్వస్థతకు గురైన వారిలో ఓ మహిళకు న్యూరో సమస్య తలెత్తి పరిస్థితి విషమించింది. దీంతో అస్వస్థతకు గురైన వారందర్నీ మెరుగైన చికిత్సల కోసం బుధవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. వీరిలో ఐదుగురు చిన్న పిల్లలు కూడా ఉన్నారు. ఫీవర్‌లో ఏడేళ్లలోపు పిల్లలకు చికిత్సలు చేయరు. అలాగే అస్వస్థతకు గురైన వారి వద్ద ఉన్న ప్రైవేట్ ఆసుపత్రి రిపోర్టులో ఓ మహిళకు న్యూరో సమస్య ఉందని పేర్కొనడంతో మెరుగైన చికిత్సల కోసం అందరినీ ఉస్మానియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఫుడ్ పాయిజన్‌కు గురైన వారిలో సయ్యద్ నసీమ్ సుల్తానా, ఖతీజ తుల్ కుబ్రా, ఆస్మా సుల్తాన, కాచిగూడ నెహ్రూనగర్‌కు చెందిన మహ్మద్ ఆమిర్ ఉన్నారు.

హరీశ్ రావు అవినీతిపై చర్యలేవి.?

భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంఓ) తాను అందజేసిన ఫిర్యాదు పత్రాలను ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "అవినీతికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. మరి చర్యలు ఎప్పుడు తీసుకుంటారు సీఎం గారూ?" అంటూ కవిత నేరుగా రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ నెల 14న సీఎంఓకు సమర్పించిన ఈ లేఖలను అధికారులు నవంబర్ 18న స్వీకరించారు. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం, డిజైన్ మార్పులు, పంప్ హౌస్ పనుల్లో తీవ్ర నాణ్యతా లోపాలు జరిగాయని ఆమె ఆరోపించారు. "సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో జరిగిన అవినీతి, డిజైన్ మార్పు, నాణ్యతా లోపాలు జరిగినట్లుగా మా దృష్టికి వచ్చిన అంశాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ వరకు నీటిని తరలించే కాలువ డిజైన్‌లో మార్పులు, పంప్ హౌస్ నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపట్టిన విచారణకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం" అని కవిత తన ఫిర్యాదులో స్పష్టం చేశారు.

రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు రెన్యువల్ సీఎం

సీఎం రేవంత్ రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు

సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శలు గుప్పిస్తూ ఆయన ఎత్తును ఉద్దేశించి వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. "వారు చిన్నగా ఉన్నారు కానీ మా ముఖ్యమంత్రి రా భయ్, నూకేయకుర్రి జరా, ఈయనేమన్నా పెద్ద ఆరు ఫీట్లు ఉన్నారా అంటే అది కూడా లేరు. రాహుల్ గాంధీ కుర్చీలో కూర్చుంటే రేవంత్ రెడ్డి టిష్యూలు తీస్తున్నారు. మొన్న రాహుల్ గాంధీ హైదరాబాద్ వస్తే ఆయన బండి వెనుక మహేష్ కుమార్ గౌడ్, మంత్రి వివేక్ వెంకటస్వామి పరుగులు తీశారు. కాంగ్రెస్ పార్టీకే కాదు మరో ఢిల్లీ పార్టీకి కూడా ఇదే జబ్బు ఉంది. అమిత్ షా రాగానే చెప్పులు ఎప్పుడు విప్పుతారా అని చూసే నేత కూడా ఉన్నారు" అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ మూడేళ్ల పాలనపై విమర్శలు

మరో పది రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సరిగ్గా మూడేళ్లు పూర్తవుతుందని పేర్కొన్న కేటీఆర్, గ్రామాల్లో ప్రజల స్పందన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉందని అన్నారు. తాను పర్యటిస్తున్న చోట్ల జనం నాడి స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. రెండేళ్ల క్రితమే కేసీఆర్ ఈ విషయాన్ని చెప్పారని గుర్తు చేస్తూ, కాంగ్రెస్ పాలన, ప్రవర్తన చూశాక ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ ఎక్కడుందంటూ టార్చ్‌లైట్ వేసుకుని వెతుక్కుంటూ వస్తారని వ్యాఖ్యానించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలోని సంక్షేమం, అభివృద్ధి ప్రజల కళ్ల ముందే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. "రాష్ట్రంలో యూరియా లేదు, కరెంట్ లేదు, కనీసం సంచులు కూడా లేవు. ఈ సంచులన్నీ దిల్లీకి పోతున్నాయి. రేవంత్ ఈఎంఐ సీఎం. రెగ్యులర్ సీఎం కాదు రెన్యువల్ సీఎం. ఈఎంఐ కడితేనే రెన్యువల్ అవుతుంటే అట్లే మన సీఎం కూడా. రైతు బంధు ఎగ్గొట్టారు. అరకొర రైతు రుణమాఫీ చేశారు. రాష్ట్రంలోని దేవుళ్లందరిపై ఒట్టు పెట్టారు. రైతులను మోసం చేశారన్నారు కేటీఆర్.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పాటుపై

భూపాలపల్లి గత వైభవాన్ని, అభివృద్ధిని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఒకప్పుడు చిన్న పల్లెగా, గ్రామ పంచాయతీగా ఉన్న భూపాలపల్లిని మున్సిపాలిటీగా మార్చి, ప్రొఫెసర్ జయశంకర్ పేరు మీద 'జయశంకర్ భూపాలపల్లి జిల్లా'గా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. గతంలో జిల్లా అధికారులను లేదా కలెక్టర్‌ను కలవాలంటే వరంగల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ కేసీఆర్ భూపాలపల్లిలోనే అద్భుతమైన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను నిర్మించి సామాన్యులకు పరిపాలనను చేరువ చేశారని కేటీఆర్ స్పష్టం చేశారు.

మూడో దశ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

నామినేషన్ల తిరస్కరణపై అప్పీళ్లను స్వీకరిస్తారు. నవంబర్ 26వ తేదీన అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. నవంబర్ 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

డిసెంబర్ 2న పోలింగ్.. అదే రోజున ఫలితాలు విడుదల

నోటిఫికేషన్ ప్రకారం గ్రామ పంచాయతీల్లో డిసెంబర్ 2వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజే ఉపసర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహిస్తారు. ఏదైనా కారణంతో ఆ రోజు ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించడం సాధ్యం కాకపోతే, మరుసటి రోజు ఎన్నిక నిర్వహిస్తారు. రీపోలింగ్ అవసరమైన సందర్భాల్లో డిసెంబర్ 3వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. రీపోలింగ్ నిర్వహించిన గ్రామ పంచాయతీల్లో ఉపసర్పంచ్ ఎన్నికను రీపోలింగ్ ఫలితాలు ప్రకటించిన తర్వాతే నిర్వహిస్తారు. మూడో విడత ఎన్నికలు జరిగే మండలాల వివరాలను నోటిఫికేషన్‌కు జతచేసిన అనుబంధం-2 లో పొందుపరిచినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

దేశాభివృద్ధికి కేంద్రం - రాష్ట్రం సమన్వయం అవసరం

వెళుతున్నాం. కేంద్రం కూడా తనవంతుగా రాష్ట్రానికి సహకారం అందించాలి అని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరారు.

మూడు జోన్లుగా తెలంగాణ

'తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా తెలంగాణను మూడు జోన్లుగా విభజన చేసి లక్ష్యాలను నిర్దేశించాం. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి భాగాన్ని సర్వీస్ సెక్టార్‌గా (క్యూర్), ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య భాగం (ప్యూర్) తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దు ప్రాంతం వరకు (రేర్) వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరారు. 'ఆయా రంగాలు అభివృద్ధి సాధించడానికి రవాణా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. అందుకు పటిష్టమైన రోడ్ నెట్‌వర్క్ ఉండాలి. ప్రధానంగా నగరాలు, గ్రామాలతో పాటు పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేస్తూ రోడ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం ద్వారా కనెక్టివిటీ, మొబిలిటీ పెరుగుతాయి. తద్వారా వ్యాపార, వాణిజ్య రంగాలు వృద్ధి సాధిస్తాయి'అని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగస్వాములు కండి

మౌలిక సదుపాయాల కల్పనలో రోడ్లు మాత్రమే కాకుండా హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విషయంలో కూడా తెలంగాణ ఎన్నో కీలకమైన చర్యలు చేపట్టింది అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హెల్త్ కేర్ ప్రాధాన్యత దృష్ట్యా పురాతన ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని అత్యంత అధునాతన వసతులతో నిర్మిస్తున్నాం అని చెప్పుకొచ్చారు. అలాగే రాష్ట్రంలోని టిమ్స్ ఆస్పత్రులు, వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు మొత్తంగా 8 వేల పడకల సామర్థ్యంతో ఆస్పత్రులను నిర్మిస్తున్నాం'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ కు హైదరాబాద్ వేదిక కావడం గర్వకారణంగా ఉందని చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగస్వాములు కావాలని సదస్సుకు హాజరైన ప్రతినిధులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఈ సదస్సులో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన రావుతోపాటు తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు, ఐఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మి కాంత పది, ఇతర కార్యవర్గ సభ్యులు, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు, ఆయా సంస్థలకు చెందిన నిపుణులు హాజరయ్యారు.

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ వ్యాఖ్యలను హైకమాండ్ నిశితంగా గమనిస్తోంది

తెలంగాణకు కీలకమైన ఎస్ఎల్బీసీ సొరంగం పనులను, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పదేళ్లపాటు పక్కన పెట్టారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల పేరుతో సుమారు రూ.1.84 లక్షల కోట్ల ప్రజాధనం వృథా అయిందని ఆరోపిస్తూ, కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన 70 శాతం వాటా కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని ఆయన తెలిపారు.అంతకుముందు, హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు వద్ద మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి మహేశ్ కుమార్ గౌడ్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. దేశ సమగ్రతకు, పేదల సంక్షేమానికి ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆమె ఆశయాల సాధనలో భాగంగానే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

మాంసం దుకాణాలపై టీజీ సేఫ్ కొరడా!

ఉల్లంఘించిన కొన్ని విక్రయ కేంద్రాలను మూసివేయాలని నిర్ణయించారు. మరికొన్ని దుకాణాలకు షోకాజ్ నోటీసులతో పాటు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. తనిఖీలు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని టీజీ సేఫ్ అధికారులు తెలిపారు. మాంసం విక్రయ కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు. త్వరలో మరో విడత తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు అందుకున్న దుకాణాల నిర్వాహకులు తమ పనితీరులో మార్పు చూపకపోతే వాటిని మూసివేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

అవుట్‌లెట్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు సస్పెండ్

రాష్ట్రంలో ప్రభుత్వం టీజీ సేఫ్‌ను ప్రారంభించినప్పటి నుంచి కల్తీ ఆహార పదార్థాలు విక్రయించే కేంద్రాలు, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపార సంస్థలపై తనిఖీలు ముమ్మరమయ్యాయి. తొలుత హోటళ్లు, రెస్టారెంట్లపై దృష్టి సారించిన విజిలెన్స్ సిబ్బంది.. అనంతరం తినుబండారాలు తయారుచేసే కేంద్రాల్లోనూ తనిఖీలు చేపట్టారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు లేకుండానే వ్యాపారాలు నిర్వహిస్తున్న రెస్టారెంట్లను గుర్తించారు. ఇటీవల పండుగల సీజన్‌ను పురస్కరించుకుని స్వీట్ల తయారీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని పలు కేంద్రాలను మూసివేశారు. మరికొన్నింటికి ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా, ఇటీవల అంతర్జాతీయ బ్రాండ్లుగా గుర్తింపు పొందిన కేఎఫ్‌సీ, డొమినోస్ పిజ్జా అవుట్‌లెట్లలోనూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు బ్రాంచీల వంటగదుల్లో అపరిశుభ్ర పరిస్థితులు వెలుగుచూశాయి. ఎలుకల విసర్జనలు, బొద్దింకలు, ఈగల బెడద ఉన్నట్లు గుర్తించారు. గోడలపై బూజు, దుర్వాసన, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, హెయిర్ నెట్‌లు ధరించకుండానే వంటలు చేస్తున్న సిబ్బందిని గుర్తించి అధికారులు విస్తుపోయారు.కల్తీ జరిగిందనే అనుమానంతో 20 ఆహార నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే పరిస్థితులు ఉన్నట్లు గుర్తించిన అధికారులు 9 అవుట్‌లెట్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను తక్షణమే సస్పెండ్ చేశారు. ఆయా అవుట్‌లెట్ల వ్యాపార కార్యకలాపాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కల్తీ ఆహారం విక్రయిస్తే రూ.5 లక్షల వరకు జరిమానా

ఆహార భద్రతా చట్టాల ప్రకారం కల్తీ ఆహార పదార్థాలను విక్రయించినట్లు రుజువైతే రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అలాగే 8 నెలల వరకు జైలు శిక్ష కూడా విధిస్తారు. కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల మరణం సంభవించిన సందర్భాల్లో యావజ్జీవ కారాగార శిక్ష విధించేందుకు కూడా నిబంధనలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.

విభరింతలపాడు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా షేక్ మీరా సాహెబ్‌కు కూటమి మద్దతు

- గ్రామ ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో ఆదరించాలి:

**- ఎమ్మెల్యే తంగ

దారుణంగా పడిపోతున్న నీటి నిల్వలు

హైదరాబాద్ : హైదరాబాద్ నగరానికి ఎల్ నినో తీవ్ర ప్రభావం చూపించబోతున్నది. ఈ నేపథ్యంలో, భారతదేశంలోని ప్రధాన నగరాల్లో నీటి సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డిసెంబర్ నాటికి, హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసే సింగూర్ మరియు మంజీరా కుంటలు పూర్తిగా ఖాళీ కావచ్చు.ప్రస్తుతం, హైదరాబాద్ రోజుకు సుమారు 600 మిలియన్ లీటర్ల నీటి కొరతను ఎదుర్కొంటోంది. ఈ కొరత వచ్చే నెలల్లో 1,000 మిలియన్ లీటర్లను మించవచ్చు. హైదరాబాద్‌లో నీటి సంక్షోభం ఇతర మెట్రో నగరాల కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా వేయబడుతోంది.నగరానికి రోజుకు సుమారు 3,200 మిలియన్ లీటర్ల నీరు అవసరం, అయితే ప్రస్తుత నీటి సరఫరా 2,600 మిలియన్ లీటర్లకు పరిమితం అయింది. సింగూర్ మరియు మంజీరా కుంటలు కలిపి 480 మిలియన్ లీటర్ల నీటిని అందిస్తున్నాయి, ఇది నగరానికి అవసరమైన మొత్తం నీటి సరఫరా లో 20% కంటే ఎక్కువ. వర్షపాతం తగ్గడం వల్ల ఈ కుంటలలో నీటి స్థాయిలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి.సింగూర్ కుంటలో కేవలం 7% నీరు మాత్రమే మిగిలి ఉంది, మంజీరాలో 17% మాత్రమే ఉంది. ఒస్మాన్ సాగర్ 54% నీటి నిల్వను కలిగి ఉంది, నాగార్జున సాగర్ 57% నీటి నిల్వను కలిగి ఉంది. ఢిల్లీ నగరానికి 1,000 మిలియన్ లీటర్ల నీటి కొరత ఉంది, అయితే ఈ సీజన్‌లో 14% ఎక్కువ వర్షపాతం అందించడం కొంత ఉపశమనం కలిగించింది.ఢిల్లీ జల్ బోర్డు అత్యవసర నీటి సరఫరా కోసం పునఃచక్రీకరణ మరియు బోర్‌వెల్స్ ద్వారా ఏర్పాట్లు చేసుకుంది. ముంబైలో పరిస్థితి మెరుగ్గా ఉంది, అక్కడ ప్రధాన కుంటలలో 80% పైగా నీటి నిల్వ ఉంది. బెంగళూరులో కావేరి బేసిన్ కుంటలు సుమారు 50% నిండినవి.బెంగళూరు నగరంలో నీటిని ఏ ప్రాంతానికి అయినా పంపించడానికి ప్రత్యామ్నాయ పంపింగ్ స్టేషన్లు ఉన్నాయి. హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి మరియు మెదక్-మల్కాజిగిరి ప్రాంతాలు ఈ సంవత్సరం 240 మిమీ తక్కువ వర్షపాతం నమోదుచేసాయి, ఇది 33% వర్షపాతం లోటును సూచిస్తుంది. జాతీయ పర్యావరణ ఇంజనీరింగ్ పరిశోధన సంస్థ నిపుణులు ఫిబ్రవరిలో నీటి మట్టం తగ్గడం గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఐటీ కారిడార్‌లో సుమారు 350,000 వినియోగదారులు పూర్తిగా మంజీరా నీటిపై ఆధారపడి ఉన్నారు. ఈ వినియోగదారులకు వచ్చే నెలలో నీటి కొరత సమస్యలు ఎదురవుతాయని అంచనా వేయబడుతోంది. హైదరాబాద్‌లో నీటి సంక్షోభం ఏప్రిల్ వరకు కొనసాగవచ్చు.ఎల్ నినో ప్రభావం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. కుంటలు అత్యంత తక్కువ స్థాయికి చేరుకునే ప్రమాదంలో ఉన్నాయి. హైదరాబాద్‌లో మొత్తం నీటి సరఫరా రోజువారీ అవసరాలను తీర్చడానికి తగినంత లేదు.నగరానికి సరఫరా చేస్తున్న నీటి మొత్తం అవసరమైన మొత్తానికి కంటే తక్కువగా ఉంది. వర్షపాతం తగ్గడం హైదరాబాద్‌లో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఈ నీటి సంక్షోభం నివాసితులు మరియు అధికారులకు పెరుగుతున్న ఆందోళనగా మారుతోంది.నిపుణులు మరియు స్థానిక అధికారులు ఈ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నీటి మట్టం తగ్గే అవకాశం దీర్ఘకాలిక ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఈ సంక్షోభం నీటి సరఫరాపై ఆధారపడి ఉన్న వివిధ రంగాలను ప్రభావితం చేయవచ్చు.ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు. వచ్చే నెలలు హైదరాబాద్‌లో నీటి నిర్వహణకు కీలకమైనవి. కుంటల పరిస్థితులు వాతావరణ నమూనాల నేరుగా ఫలితంగా ఉన్నాయి.ప్రత్యేక నీటి వనరులపై ఆధారపడటం వలనే ఈ నగరం మరింత ప్రమాదంలో ఉంది. వచ్చే నెలల్లో వర్షపాతం అంచనాలు అనిశ్చితంగా ఉన్నాయి. ఈ పరిస్థితి సుస్థిరమైన నీటి నిర్వహణ పద్ధతుల అవసరాన్ని ప్రదర్శిస్తోంది.స్థానిక సమాజాలను నీటిని ఆదా చేయాలని సూచిస్తున్నారు. ఈ సంక్షోభం నీటి వనరుల కోసం పెరిగిన పోటీని కలిగించవచ్చు. భవిష్యత్తులో నీటి కొరతలను నివారించడానికి దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరం.నగరంలోని చెరువులు, నాలాలు, వాటి రీఛార్జ్ ప్రాంతాలను ఆక్రమణలు, కాలుష్యం నుంచి రక్షించే బాధ్యతను హైడ్రాకు అప్పగించారు. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (ఖఖఖ) విధానంలో నిర్వహిస్తున్న ఎస్టీపీల్లో నీటి నాణ్యతను పర్యవేక్షించాలి. క్యూర్ చట్టం-2026లోని సెక్షన్లు 241, 242 ప్రకారం తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలి. అవసరమైన సందర్భాల్లో ఇతర ప్రభుత్వ శాఖలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యల్లో సహకరించాలి. నీటి వనరుల పరిరక్షణతోపాటు భూగర్భ జలాల రీఛార్జ్‌కు ఉపయోగపడే ప్రాంతాలను కాపాడటంపై ప్రత్యేక దృష్టి సారించనుంది.రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి 100 ఎంఎల్‌డీ లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి కేంద్రాలను పర్యవేక్షించనుంది. శుద్ధి చేసిన నీరు నిర్దేశిత నాణ్యతా



ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించాలి. ప్రమాణాలు పాటించని సంస్థలపై చట్టపరమైన, నియంత్రణపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు భూగర్భజల శాఖ వాల్టా చట్టం-2002 ప్రకారం అక్రమ బోర్ల తవ్వకాలు, భూగర్భ జలాల అనధికార వినియోగాన్ని నియంత్రించనుంది. క్యూర్ పరిధిలోని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలను నిరంతరం విశ్లేషిస్తూ కొత్త బోర్ల తవ్వకాలకు అనుమతుల విషయంలో పర్యవేక్షణ చేపట్టనుంది. హైదరాబాద్ పరిధిలోని మూడు నగరపాలక సంస్థలు, హెచ్‌ఎండీఏ తమ పరిధిలో 100 ఎంఎల్‌డీల కంటే తక్కువ సామర్థ్యం కలిగిన ప్రైవేట్ ఎస్టీపీల నిర్వహణను పర్యవేక్షించనున్నాయి. కొత్త భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా ఎస్టీపీల ఏర్పాటు నిబంధనలను అమలు చేయాలి. శుద్ధి చేసిన మురుగునీటిని తాగునీరు అవసరం లేని ఇతర పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ కోసం రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసేలా చూడాలి. సమాచార, పౌర సంబంధాల శాఖ జలమండలితో కలిసి నీటి సంరక్షణ, నీటి భద్రత, గ్రీన్ ట్యాంకర్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనుంది. ప్రచార కార్యక్రమాల ద్వారా నీటి పొదుపు ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లనుంది. మొత్తంగా రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించడం, ప్రత్యామ్నాయ నీటి సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడమే ప్రభుత్వ కార్యాచరణ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది

రికార్డు స్థాయిలో పడిపోతున్న యెల్లో మెటల్

ముంబై : దేశీయంగా, అంతర్జాతీయంగా బంగారం ధరలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇప్పుడు వరుసగా ఆరో సెషన్‌లోనూ రేట్లు భారీగా పడిపోతున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు ప్రస్తుతం ఏకంగా 3800 డాలర్ల మార్కు దిగువకు చేరింది. అంటే గతేడాది సెప్టెంబరులో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఈ స్థాయిలో కొనసాగింది. అక్కడి నుంచి భారీగా పెరిగి ఈ ఏడాది జనవరి చివర్లో ఏకంగా ఔన్సుకు 5600 డాలర్లకు చేరిన సంగతి తెలిసిందే. అంటే గరిష్ఠ స్థాయిల నుంచి పసిడి ధర 30 శాతానికిపైగా పడిపోయింది. సిల్వర్ రేటు చూస్తే మరీ ఎక్కువగా పడిపోయింది. అదే జనవరిలో ఔన్సుకు 121 డాలర్ల స్థాయిలో గరిష్ఠాల్ని తాకగా ఇప్పుడు అది 46 డాలర్లకు చేరింది. ఇది 60 శాతానికిపైగా పతనాన్ని చూయిస్తుంది.ఇక తాజాగా దేశీయంగా బంగారం, వెండి ధరలు భారీ స్థాయిలో పతనం అవుతున్నాయి. రోజు రోజుకు వేలల్లో తగ్గుముఖం పడుతున్నాయి. గతంలో గ్రాము బంగారం కొనాలంటేనే కష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు సామాన్యుడు సైతం కొనుగోలు చేసే విధంగా ధరలు అమాంతంగా దిగి వస్తున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,250 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,22,140 వద్ద కొనసాగుతోంది. నిన్న ఒక్క రోజే దాదాపు 3 వేల రూపాయల వరకు దిగి వచ్చింది. వెండిపై 5 వేల రూపాయల వరకు తగ్గింది.ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,340 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,22,290 వద్ద కొనసాగుతోంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,250 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,22,140 వద్ద కొనసాగుతోంది. బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,250 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,22,140 వద్ద కొనసాగుతోంది. నిన్న ఒక్క రోజే దాదాపు 3 వేల రూపాయల వరకు దిగి వచ్చింది. వెండిపై 5 వేల రూపాయల వరకు తగ్గింది.

ఆయిల్‌పామ్ టన్నుకు రూ.25 వేలు ఇవ్వాలి



ఖమ్మం : పెరుగుతున్న సాగు ఖర్చులకు అనుగుణంగా ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును రైతులు కోరారు. ప్రస్తుతం రైతులు, ఆయిల్‌పామ్ కంపెనీల మధ్య అమలవుతున్న 75:25 ఆదాయ పంపిణీ విధానాన్ని 80:20కి మార్చాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే ఆయిల్‌పామ్ గెలలకు (ఎఫ్ఎఫ్‌బీ) టన్నుకు కనీసం రూ.25 వేల గ్యారంటీ ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మంగళవారం సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన రైతు ప్రతినిధులు తమ సమస్యలను వివరించి, సాగు కొనసాగించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఆదాయ పంపిణీ విధానంలో రైతులకు లభిస్తున్న వాటా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.ఆయిల్‌పామ్ సాగులో పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగిపోయిందని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎరువుల ధరలు, వ్యవసాయ కూలీల వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు గతంతో పోలిస్తే రెట్టింపయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి దిగుబడులు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. పెట్టుబడులు పెరుగుతున్నా ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో రావడం లేదని, దీంతో ఆయిల్‌పామ్ సాగు భారంగా మారుతోందని వివరించారు. ఈ పరిస్థితుల్లో రైతులకు న్యాయమైన ఆదాయం దక్కాలంటే ప్రస్తుతం అమలవుతున్న 75:25 ఆదాయ పంపిణీ నిష్పత్తిని 80:20కి సవరించాలని కోరారు. ఈ విధానాన్ని అమలు చేస్తే ఒక్కో టన్ను ఆయిల్‌పామ్ గెలపై రైతులకు సుమారు రూ.1,516 అదనపు ఆదాయం లభిస్తుందని అంచనా వివరించారు.ఆదాయ పంపిణీ నిష్పత్తిని మార్చడం సాధ్యం కాని పక్షంలో కనీస మద్దతు ధర తరహాలో టన్నుకు రూ.25 వేల గ్యారంటీ ధర నిర్ణయించాలని ప్రత్యామ్నాయ ప్రతిపాదనను కూడా రైతులు ముందుంచారు. దీనివల్ల మార్కెట్ ధరల్లో హెచ్చుతగ్గులు, దిగుబడుల తగ్గుదల వంటి పరిస్థితుల్లో రైతులకు కొంత ఆర్థిక భద్రత లభిస్తుందని అభిప్రాయపడ్డారు. రైతుల విజ్ఞప్తులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. ఆదాయ పంపిణీ నిష్పత్తి మార్పు అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రైతులకు ప్రయోజనం కలిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆయిల్‌పామ్ రైతులు తమ డిమాండ్లపై ప్రభుత్వం చొరవ తీసుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణలో పంట రుణమాఫీపై బీఆర్ఎస్ విమర్శలను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తిప్పికొట్టారు.

పసుపు ధర సరికొత్త రికార్డు



వరంగల్ : తెలంగాణ పసుపు రైతులకు ఊరటనిచ్చే పరిణామం చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పసుపు ధర సరికొత్త రికార్డు సృష్టించింది. క్వింటాల్ పసుపు గరిష్ఠంగా రూ.19,253 పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో జరిగిన ఈ-వేలంలో నాణ్యమైన పసుపు కోసం వ్యాపారుల మధ్య పోటీ నెలకొనడంతో ధర ఒక్కసారిగా పెరిగింది. ఈ నెల 22వ తేదీన నమోదైన గరిష్ఠ ధర రూ.13,319తో పోలిస్తే తాజా వేలంలో ఏకంగా రూ.6 వేల వరకు పెరుగుదల కనిపించింది. మార్కెట్ చరిత్రలోనే క్వింటాల్ పసుపునకు ఈ స్థాయిలో ధర లభించడం విశేషంగా నిలిచింది.కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం నిర్వహించిన ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) ఈ-వేలంలో కాడి, గోళ రకం పసుపును రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. మొత్తం 10 మంది రైతులు 99 బస్తాల పసుపును మార్కెట్‌కు తీసుకువచ్చారు. ఇందులో ఏడుగురు రైతులు 69 బస్తాల కాడి రకం పసుపును.. ముగ్గురు రైతులు 30 బస్తాల గోళ రకం పసుపును విక్రయానికి ఉంచారు. ఈ వేలంలో కాడి రకం పసుపునకు అత్యధికంగా క్వింటాల్‌కు రూ.19,253 ధర లభించింది. కనిష్ఠ ధర రూ.15,589గా నమోదైంది. సగటు ధర రూ.19,252గా ఉన్నట్లు మార్కెట్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.గోళ రకం పసుపు విషయానికి వస్తే గరిష్ఠ ధర క్వింటాల్‌కు రూ.18,566 పలికింది. కనిష్ఠ ధర రూ.8,506గా నమోదవగా.. సగటు ధర రూ.17,469గా ఉంది. రకం, నాణ్యతను బట్టి ధరల్లో వ్యత్యాసం కనిపించినప్పటికీ.. మొత్తంగా మార్కెట్‌లో పసుపునకు మంచి ధరలు లభించడం రైతుల్లో ఆశలు పెంచింది. కేసముద్రం మార్కెట్‌లో పసుపు ధరల పెరుగుదల రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. మార్కెట్‌కు వచ్చిన పసుపు నాణ్యత మెరుగ్గా ఉండటంతో వ్యాపారులు కొనుగోలుపై ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది పసుపు ధరలు తక్కువ స్థాయిలోనే ఉన్నాయి. ఆ రోజు కాడి రకానికి గరిష్ఠంగా రూ.11,609.. కనిష్ఠంగా రూ.7,011 లభించగా, గోళ రకానికి గరిష్ఠంగా రూ.10,511, కనిష్ఠంగా రూ.7,011 నమోదయ్యాయి. ఆ ధరలతో పోలిస్తే తాజాగా ధరలు గణనీయంగా పెరిగాయి. కేసముద్రం మార్కెట్‌లో అమలవుతున్న ఈ-నామ్ విధానం ద్వారా వ్యాపారులు ఆన్‌లైన్‌లో బిడ్లు దాఖలు చేసి పంటను కొనుగోలు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా కొనుగోళ్లలో పారదర్శకత పెరగడంతో పాటు పంట నాణ్యతను బట్టి ధర నిర్ణయించే అవకాశం ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.తాజా వేలంలో నాణ్యమైన పసుపునకు అధిక ధర లభించడానికి మార్కెట్‌కు వచ్చిన సరుకు నాణ్యత ఒక ముఖ్యమైన కారణంగా కనిపిస్తోంది. కొనుగోలుదారుల మధ్య పోటీ కూడా ధర పెరుగుదలకు కారణమైందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు రాష్ట్రంలోని పసుపు సాగు చేసే ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరత పంట దిగుబడిపై ప్రభావం చూపినట్లు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, మహబూబాబాద్ వంటి ప్రాంతాల్లో పంట ఎదుగుదల, దుంపల పరిమాణం వంటి అంశాలు దిగుబడిని ప్రభావితం చేయవచ్చు. ధరలు పెరగడం రైతులకు ఊరటనిచ్చినా.. పంట దిగుబడి తగ్గిన వారికి మొత్తం ఆదాయం తగ్గనుంది.

ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

పల్నాడు దాచేపల్లి మండలం గ్రామాలపాడు సమీపంలోబుధవారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం జరిగింది. తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్న మట్టిలోడు కంటైనర్ లారీ అదుపుతప్పి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న డీసీఎం లారీపై పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దాచేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలు, క్షతగాత్రులను గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



కామారెడ్డిలో అర్ధరాత్రి ముసుగు దొంగల హల్‌చల్

కామారెడ్డి పట్టణంలోని దేవి వీహార్ కాలనీలో అర్ధరాత్రి ముసుగు దొంగలు హల్‌చల్ చేశారు. అపార్ట్‌మెంట్లలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని, ఓ ఇంట్లోకి చొరబడి రూ.25 వేల నగదును అపహరించారు. ఇందుకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతుండగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ ఫుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

అక్వాన్ తుపాను .. భారీ వర్ష సూచన

విశాఖపట్నం అక్వాన్ తుపాను మార్గం మారింది. నవంబర్ 20 మధ్యాహ్నం నరసాపురం?పూరీ మధ్య ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాల మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 90?100 కి.మీ వేగంతో గాలులు, అప్పుడప్పుడు 110 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి.

తుపాను ప్రభావంతో నవంబర్ 19, 20 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. పార్వతీపురం మన్యం, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

బియ్యం దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు



చిలకలూరిపేట: బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం రాత్రి పాత సంత బజారులోని అరుణాచల ట్రేడర్స్ బియ్యం దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 83 బియ్యం బస్తాలపై ఎంఆర్‌పీ, ప్యాకింగ్ తేదీ వివరాలు లేకపోవడంతో పాటు కాటాపై తూనికలు, కొలతల శాఖ ముద్రలు లేవని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ తహసీల్దార్ మాధవి, డీసీటీవో రామారావు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సాయి శ్రీకర్, ఆర్ఐ రమిజా, సిబ్బంది గోపి, శివకృష్ణ పాల్గొన్నారు.

ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్..
మరో నిందితుడు పరారీ



ఇబ్రహీంపట్నం: ఎస్ఓటీ మహేశ్వరం బృందం డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లాకు చెందిన అబ్దుల్ మిషాల్ (33), తారిఖ్ (25) డ్రగ్స్ విక్రయిస్తూ వారు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వీరిద్దరినీ ఎస్ఓటీ బృందం అదుపులోకి తీసుకుంది. వీరికి డ్రగ్స్ సరఫరా చేస్తున్న బెంగళూరుకు చెందిన పీటర్ అలియాస్ పప్పీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో తదుపరి చర్యలు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు

దీక్షా దివస్ స్ఫూర్తి కొనసాగుతుంది : నాగరాజు గుర్రాల



జోహన్నెస్‌బర్గ్, దక్షిణాఫ్రికా : దీక్షా దివస్ స్ఫూర్తి కొనసాగుతుందని బీఆర్ఎస్ ఎన్నారై దక్షిణాఫ్రికా శాఖ నాయకుడు గుర్రాల నాగరాజు అన్నారు. నవంబర్ 29న నిర్వహించనున్న దీక్షా దివస్ సందర్భంగా బీఆర్ఎస్ ఎన్నారై దక్షిణాఫ్రికా శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 14 రోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మూడవ రోజు కోర్ కమిటీ సమావేశం నాగరాజు గుర్రాల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎన్నారై దక్షిణాఫ్రికా కోర్ కమిటీ సభ్యులందరూ పాల్గొని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటించారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ గారు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఒక కీలక మలుపు. నాడు కేసీఆర్చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి కొత్త ఊపిరి పోసింది. ఆ దీక్షా ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందనే చారిత్రక సత్యాన్ని భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్ బిగాల ఆన్‌లైన్ ద్వారా పాల్గొని కోర్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు.దీక్షా దివస్ చారిత్రక ప్రాధాన్యతను వివరిస్తూ, 14 రోజుల కార్యక్రమాల లక్ష్యాలు, నిర్వహణ, తెలంగాణ ఉద్యమ చరిత్రను ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలకు చేరవేయడంపై విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి మేడసాని, హరీశ్ రంగ, అరవింద్ చీకోటి, కిరణ్ కుమార్ బెల్లి, సాయి కిరణ్ నల్ల, సౌజన్ రావు, రాంబాబు, వురే వంశీ, వెంకట్ రావు తల్లపల్లి, నవదీప్ రెడ్డి, రంజిత్, బాలు, విజయ్ జుంజూర్, సుమన్ పోరండ్ల, రవీందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి తదితర కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాలుగు రోడ్ల సర్కిల్‌లో టీ షాపులో అగ్నిప్రమాదం

కడప బద్వేల్ పట్టణంలోని నాలుగు రోడ్ల సర్కిల్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ టీ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం.క్షణాల్లోనే మంటలు పక్కకు వ్యాపించి సమీపంలోని పచారీ షాప్, మొబైల్ షాప్, చెప్పుల షాపులకు కూడా అంటుకున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. దుకాణాల యజమానులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వారి సకాల స్పందనతో పెద్ద ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు.మంటలు అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అగ్నిప్రమాదం కారణంగా దుకాణాలకు ఎంత మేర నష్టం వాటిల్లిందన్న వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

సర్పంచ్ పోస్టుకు డిమాండ్

కాకినాడ : గ్రామ రాజకీయాలు అనగానే ముందుగా గుర్తొచ్చే పదవి సర్పంచ్ ఎమ్మెల్యే ఎంపీ వంటి పదవులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్నప్పటికీ, గ్రామంలో మాత్రం సర్పంచ్‌కు ఉండే ప్రత్యేకతే వేరు. ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుంటూ, ప్రతి కుటుంబంతో సంబంధాలు కొనసాగించే అవకాశం ఈ పదవికి ఉంటుంది. అందుకే గ్రామాల్లో సర్పంచ్‌గా గెలవాలని చాలామంది లక్షల రూపాయలు ఖర్చు పెట్టడానికి కూడా వెనుకాడరు. దీని వెనుక కేవలం రాజకీయ అధికారం మాత్రమే కాకుండా గౌరవం, గుర్తింపు, నాయకత్వం వహించాలనే కోరిక కూడా ఉంటాయి.ఒక గ్రామానికి ఎన్నికైన ప్రజాప్రతినిధిగా సర్పంచ్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా, ఏ సమస్య వచ్చినా ముందుగా సంప్రదించేది ఆయన్నే. పెళ్లిళ్లు, పండుగలు, జాతరలు వంటి సందర్భాల్లో సర్పంచ్‌కు ఇచ్చే మర్యాద కూడా ప్రత్యేకంగా ఉంటుంది. గ్రామానికి అధికారులు వచ్చినప్పుడు స్థానిక పరిస్థితులను వివరించడంలో సర్పంచ్ కీలక పాత్ర పోషిస్తారు. జిల్లా కలెక్టర్ నుంచి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరకు గ్రామ సమస్యలపై చర్చించేటప్పుడు సర్పంచ్ అభిప్రాయానికి ప్రాధాన్యం ఉంటుంది. పదవీకాలం పూర్తయిన తర్వాత కూడా మాజీ సర్పంచ్ గా ప్రజల్లో గుర్తింపు కొనసాగడం ఈ పదవికి ఉన్న ప్రత్యేకతను తెలియజేస్తుంది.మరోవైపు, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయగలగడం కూడా చాలామందిని ఈ పదవి వైపు ఆకర్షిస్తుంది. వీధి దీపాలు పనిచేయకపోయినా, తాగునీటి సమస్య ఎదురైనా, రోడ్లు దెబ్బతిన్నా గ్రామస్థులు మొదట సర్పంచ్‌నే ఆశ్రయిస్తారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడటం, పెన్షన్లు ఇతర సంక్షేమ కార్యక్రమాల్లో ఎదురయ్యే ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి బాధ్యతలు కూడా ఉంటాయి. ఒక పేద కుటుంబానికి అవసరమైన సమయంలో సహాయం అందించగలిగితే ప్రజల్లో లభించే అభిమానం నాయకులకు ఎంతో సంతృప్తిని ఇస్తుంది.గ్రామ అభివృద్ధి లోనూ సర్పంచ్ పాత్ర కీలకమే. సీసీ రోడ్లు , డ్రైనేజీ వ్యవస్థ , తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్యం , పాఠశాలల అభివృద్ధి వంటి అంశాల్లో స్థానిక సంస్థల ద్వారా పనులు చేపట్టాల్సి ఉంటుంది. గ్రామ అవసరాలను గుర్తించి ప్రణాళికలు రూపొందించడం, ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసేలా చూడటం అవసరం. ఒక మంచి నాయకుడి చొరవతో గ్రామ రూపురేఖలే మారిపోయే అవకాశం ఉంటుంది. అయితే ఈ పనులన్నీ సర్పంచ్ ఒక్కరి నిర్ణయంతోనే పూర్తయ్యేవి కావు. పంచాయతీ పాలకవర్గం అధికారులు, ప్రభుత్వ సహకారం కూడా అవసరం.ఇక గ్రామాల్లో చిన్నపాటి వివాదాలు తలెత్తినప్పుడు ఇరువర్గాల మధ్య చర్చలు జరిపి సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ ప్రయత్నిస్తుంటారు. దీంతో గ్రామంలో ఆయనకు సామాజికంగా కూడా గుర్తింపు లభిస్తుంది. అయితే చట్టపరమైన వివాదాలను పరిష్కరించే అధికారం న్యాయస్థానాలు , సంబంధిత అధికారులకే ఉంటుంది.రాజకీయంగా చూస్తే సర్పంచ్ పదవి ఎంతోమంది నాయకులకు తొలి మెట్టుగా నిలుస్తోంది. ఈ స్థాయి నుంచి ఎదిగి ఎమ్మెల్యేలు, మంత్రులుగా మారిన నాయకులు చాలామంది ఉన్నారు. గ్రామస్థాయిలో ప్రజల మద్దతు సంపాదించడం, ఎన్నికల్లో ప్రత్యర్థులను ఎదుర్కోవడం భవిష్యత్తు రాజకీయాలకు అనుభవాన్ని అందిస్తాయి. అందుకే ఎన్నికల సమయంలో ఈ పదవి కోసం గట్టి పోటీ కనిపిస్తుంది. మొత్తంగా చూస్తే సర్పంచ్ పదవి అనేది కేవలం ఒక హోదా మాత్రమే కాదు.. ప్రజల మధ్య గుర్తింపు సంపాదించడానికి, గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి లభించే అరుదైన అవకాశం.

లక్షలు పెట్టి... వేల రూపాయిల జీతం

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీల్లోనూ ఎన్నికల వేడి కనిపిస్తోంది. ఈ నెల 26న మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనుండగా, గ్రామ పంచాయతీలకు ఈ నెల 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో మూడు విడతలుగా పోలింగ్ నిర్వహించనున్నారు. మేయర్ పదవి నుంచి పంచాయతీ వార్డు సభ్యుడి వరకు అనేక స్థానాలకు పోటీ నెలకొంది. అయితే ఈ ఎన్నికల సందర్భంగా ప్రజల్లో ఒక ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసి మరీ పదవులను దక్కించుకోవాలని నాయకులు ఎందుకు ప్రయత్నిస్తున్నారు? ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ఎంత? వారికి ఎలాంటి సదుపాయాలు ఉంటాయి? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.స్థానిక సంస్థల పదవులు ప్రజలకు దగ్గరగా ఉండే బాధ్యతాయుతమైన స్థానాలు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి సమస్యల పరిష్కారంలో సర్పంచులు, వార్డు సభ్యులు కీలక పాత్ర పోషిస్తారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల పర్యవేక్షణలో కార్పొరేటర్లు, మేయర్లు బాధ్యతలు నిర్వహిస్తారు. అయితే ఈ పదవులకు లభించే నెలవారీ గౌరవ వేతనాలను పరిశీలిస్తే ఆశ్చర్యం కలగకమానదు. పంచాయతీ వార్డు సభ్యులకు ప్రత్యేకంగా గౌరవ వేతనం ఉండదు. సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు నెలకు రూ.3 వేల చొప్పున అందుతుంది. జెడ్పీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులకు రూ.6 వేల గౌరవ వేతనం లభిస్తుంది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌కు నెలకు రూ.4 వేలుగా గౌరవ వేతనం నిర్ణయించారు.పట్టణ స్థానిక సంస్థల్లోనూ పరిస్థితి పెద్దగా భిన్నంగా లేదు. కార్పొరేషన్‌లో సాధారణ కార్పొరేటర్‌కు నెలకు రూ.6 వేల గౌరవ వేతనం అందుతుంది. డిప్యూటీ మేయర్‌కు రూ.20 వేలు, మేయర్‌కు రూ.30 వేల వరకు చెల్లిస్తారు. ఇంతటి బాధ్యతలు నిర్వహించే ప్రజాప్రతినిధులకు అందే మొత్తం చాలా తక్కువగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో ప్రచారం, కార్యకర్తల నిర్వహణ, ఇతర ఖర్చుల కోసం భారీగా డబ్బు వెచ్చించే అభ్యర్థులతో పోలిస్తే ఈ గౌరవ వేతనాలు ఏమాత్రం సరిపోవని పలువురు అంటున్నారు.మరోవైపు ప్రజాప్రతినిధులకు అధికార నివాసాలు, కార్యాలయాల సదుపాయాలు కూడా చర్చనీయాంశంగా మారాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లకు అధికార నివాసాలు ఉండగా, కొత్తగా ఏర్పడిన జిల్లాల పరిషత్‌లలో అలాంటి వసతులు పూర్తిస్థాయిలో లేవనే అభిప్రాయాలు ఉన్నాయి. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లలోనూ చాలా చోట్ల మేయర్లకు ప్రత్యేక ప్రభుత్వ నివాసాలు అందుబాటులో లేవు. గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల్లో గతంలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటు ఉన్నప్పటికీ, అనేక ప్రాంతాల్లో మేయర్లు తమ సొంత ఇళ్ల నుంచే విధులు నిర్వహిస్తున్నారు.ప్రభుత్వ నివాసాలు లేని చోట నిబంధనల ప్రకారం ఇంటి అద్దె భత్యం లేదా క్యాంపు కార్యాలయ నిర్వహణ ఖర్చులు అందించే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్రత్యేక కార్యాలయం ఉంటే మరింత సౌకర్యంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన మేయర్లు, చైర్‌పర్సన్లకు తగిన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో కొత్తగా బాధ్యతలు చేపట్టే ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనంతో పాటు కార్యాలయాలు, నివాస సదుపాయాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

ఏసీబీ వలలో టోలి చౌకి ఎస్ హెచ్ వో



హైదరాబాద్ టోలి చౌకి పోలీస్ స్టేషన్ లో ఎస్ హెచ్ వో ఎల్.రమేశ్ నాయక్ రూ 20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ప్రతి నెల రూ.50 వేలు ఇవ్వాలని ఓ హోటల్ యజమానికి లంచంఎల్.రమేశ్ నాయక్ డిమాండ్ చేసాడు. అర్ధరాత్రి 1 గంట తర్వాత కూడా హోటల్ నిర్వహించుకోవడానికి అనుమతి ఇచ్చేందుకే ఈ లంచం డిమాండ్ చేసాడు. మొదట్లో రూ.10 వేలు.. ఆపై అక్టోబర్ 31న హోటల్ యజమాని నుంచి రూ.20 వేలు తీసుకున్నాడు. మరో రూ.20 వేలు ఇవ్వాలని అడగడంతో.. న హోటల్ యజమాని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదుతో.. రమేశ్ నాయక్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేలా ఏసీబీ అధికారులు వల పన్నారు. పోలీస్ స్టేషన్‌లోనే రూ.20 వేలు తీసుకుంటుండగా.. దాడులు చేసి పట్టుకున్నారు. స్టేషన్‌లో తనిఖీలు చేయగా.. నాలుగు వేర్వేరు కవర్లలో లెక్కల్లో చూపని రూ.1.85 లక్షలు దొరికాయి. ఆ మొత్తాన్ని సీజ్ చేసి.. రమేష్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం

అనంతపురం రాప్తాడు మండలం రామినేపల్లి వద్ద ఎఫ్‌ఆర్‌కే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. బెంగళూరు నుంచి హైదరాబాద్ ఎఫ్ ఆర్ కె ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెళ్తుంది. బస్సులోని 30 నుంచి 40 మంది ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. గురువారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం లేదని సమాచారం. డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే బస్సు అదుపుతప్పి ప్రమాదానికి గురైనట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ ఘటనా స్థలం నుంచి పరారైయాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

భైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి హౌస్ అరెస్టు

నంద్యాల గురువారం నాడు రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపీ (ఓఖఖ) ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయింది. నంద్యాల జిల్లా మిడుతూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో వైకాపా స్పష్టమైన ఆధిక్యం సాధించింది. వైసీపీ ఎంపీపీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బయలుదేరిన వైసీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ భైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ని పోలీసులు ని హౌస్ అరెస్ట్ చేసారు.

ఇంటింటికి గ్యాస్ పైప్ లైన్...

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా ప్రాజెక్టుకు సంబంధించి కీలక ముందడుగుపడింది. గెయిల్ (గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్) ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చు సుమారు రూ.1,000 కోట్లను భరించేందుకు ఓకే చెప్పింది. కేంద్రం కృష్ణా-గోదావరి బేసిన్‌లో గ్యాస్ వెలికి తీసి పైప్‌లైన్ ద్వారా ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో ఉన్న పరిశ్రమలతో పాటుగా ఇతర అవసరాలకు సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టింది. 2022లో పీఎం ఊర్జ్ గంగా పైప్‌లైన్ కింద అనుమతించింది. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ వ్యయంలో 50శాతం భరించాలి.. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వరకు పైప్‌లైన్ కూడా నిర్మించాలి.గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదని చెబుతున్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో మాట్లాడి ఈ ప్రాజెక్ట్ మళ్లీ పట్టాలెక్కించేందుకు చర్యలు ప్రారంభించింది. ఏపీ ప్రభుత్వం పైప్‌లైన్ ఏర్పాటుకు అవసరమైన భూముల సేకరణ ప్రక్రియను చేపట్టనుంది. ఈ క్రమంలో గెయిల్ అధికారులు త్వరలోనే ఏపీకి రానున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.2,650 కోట్లతో మొత్తం 965 కిలోమీటర్లు పైప్‌లైన్ నిర్మించాల్సి ఉంటుంది. ఒడిశాలోని దామ్రా టు శ్రీకాకుళం దాదాపు 516 కిలోమీటర్లు పైప్‌లైన్ నిర్మాణ పనులు గంతలోనే పూర్తయ్యింది.శ్రీకాకుళం నుంచి కాకినాడ వరకు దాదాపు 320 కిలోమీటర్లు పైప్‌లైన్ పనులు పూర్తికాలేదు. కాకినాడ టు విశాఖపట్నం 188 కిలోమీటర్లు, శ్రీకాకుళం టు విశాఖపట్నం 112 కిలోమీటర్లు పైప్‌లైన్ కూడా పూర్తి కావాల్సి ఉంది. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ అభివృద్ధి చేస్తే ఏపీతో పాటుగా ఒడిశాలో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయొచ్చంటున్నారు. అందుకే గెయిల్ అధికారుల టీమ్ రాష్ట్ర ప్రభుత్వంతో ప్రాజెక్టు పనులపై చర్చించేందుకు రానుంది. గతంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్ ఎంతవరకు ఉపయోగించుకోవచ్చో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. ఒకవేళ గతంలో వేసిన పైప్‌లైన్ పూర్తిగా దెబ్బతింటే.. కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు.ఏపీ ప్రభుత్వం 2022లో ప్రాజెక్టు చేపట్టిన తర్వాత పైప్‌లైన్ కోసం రూ.350 కోట్లు ఖర్చు చేసింది. ఏపీజీడీసీఎల్ ఏర్పాటు చేసి గెయిల్‌తో కలిసి పనులు నిర్వహించాలని ప్లాన్ చేసింది. మిగిలిన నిధులు విడుదల చేయకపోవడం, పనులు ఆలస్యం అయ్యాయి. దీంతో 2023లో కేంద్ర ఈ ప్రాజెక్టును రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం కేంద్రంతో చర్చించడంతో.. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర వాటా మొత్తాన్ని భరించే పరిస్థితి లేదని కేంద్రానికి చెప్పింది. దీంతో కేంద్రం ఈ ప్రాజెక్టు ప్రారంభించేందుకు ఓకే చెప్పగా.. వ్యయం మొత్తాన్ని గెయిల్ భరించేలా నిర్ణయించింది.

హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టులో ముందడుగు

అమరావతి : దక్షిణ భారతదేశంలో రవాణా వ్యవస్థ రూపురేఖలను పూర్తిగా మార్చేసే ప్రతిష్ఠాత్మక హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టులో ఒక కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నై వరకు నిర్మించనున్న ఈ 760 కిలోమీటర్ల కారిడార్‌లో, అమరావతి రైల్వే స్టేషన్‌ను విజయవాడ నగరానికి కేవలం 13 కిలోమీటర్ల దూరంలోనే నిర్మించేందుకు నేషనల్ హైస్పీడ్ రైల్ కారిడార్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్) అంగీకరించింది. విజయవాడ వాసులు బుల్లెట్ రైలు ఎక్కేందుకు ఎక్కువ దూరం వాహనాల్లో ప్రయాణించాల్సిన ఇబ్బంది లేకుండా, వీలైనంత చేరువలో ఈ స్టేషన్ ఉండాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు సంస్థ సమ్మతి తెలిపింది. ఏపీ పరిధిలోని 518 కిలోమీటర్ల మేర దాచేపల్లి, అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి మీదుగా చెన్నై వెళ్లే ఎలైన్‌మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పూర్తి క్లియరెన్స్ ఇచ్చింది.ఏపీ ప్రభుత్వం తన పరిధిలో మార్గాన్ని వేగంగా ఖరారు చేసినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలైన్‌మెంట్‌పై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదు. శంషాబాద్, భారత్‌సిటీ, డ్రైపోర్ట్, హాలియా, వాడపల్లి మీదుగా ఈ కారిడార్ ఏపీలోకి ప్రవేశించేలా ప్రతిపాదించిన మార్గం హైదరాబాద్ నగరానికి దూరమవుతుందన్న వాదనతో అక్కడ నిర్ణయం జాప్యమవుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ అధికారులు ఫైనల్ లొకేషన్ సర్వే , డీపీఆర్ తయారీని తాత్కాలికంగా పక్కనపెట్టి, దీనిపై తుది నిర్ణయం తీసుకోవాలని రైల్వే బోర్డుకు నివేదించారు.మ్యాప్‌లు చూడండి(మరోవైపు తమిళనాడులో ఏర్ప డిన కొత్త ప్రభుత్వం విమానాశ్రయ ప్రతిపాదనను పెరందూరు నుంచి వేరే ప్రాంతానికి మార్చడంతో, చెన్నై-చిత్తూరు-బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్ ఎలైన్‌మెంట్‌పైనా సందిగ్ధత నెలకొంది.

చిట్వేలి ఎంపీపీగా రాటకొండ కల్పన ఏకగ్రీవ ఎన్నిక

చిట్వేలి చిట్వేలి మండల పరిషత్ అధ్యక్షురాలిగా తిమ్మయ్య గారి పల్లి ఎంపీటీసీ సభ్యురాలు రాటకొండ కల్పన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలోని సభా భవనంలో చిట్వేలి మండల ఎన్నికల అధికారి జయ భరత్ రెడ్డి నిర్వహించిన మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో ఆమెకు సభ్యుల నుంచి పూర్తి మద్దతు లభించింది. తుమ్మకొండ ఎంపీటీసీ సభ్యుడు సేతు శంకరయ్య రాటకొండ కల్పన పేరును అధ్యక్ష పదవికి ప్రతిపాదించగా, నాగవరం ఎంపీటీసీ సభ్యుడు నరసింహులు పంతగాని ఆ ప్రతిపాదనను బలపరిచారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీటీసీ సభ్యులతో సహా మొత్తం పది మంది ఎంపీటీసీ సభ్యులు రాటకొండ కల్పనకు మద్దతుగా చేతులెత్తి తమ అంగీకారాన్ని తెలిపారు. అధ్యక్ష పదవికి మరెవరూ పోటీలో లేకపోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల ఎన్నికల అధికారి అధికారికంగా ధ్రువీకరించారు. అదే విధంగా మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా కేఎస్. అగ్రహారం ఎంపీటీసీ సభ్యురాలు పాటూరు సుమలత ఎన్నికయ్యారు. ఆమె ఎన్నిక కూడా సభ్యుల మద్దతుతో పూర్తయింది. చిట్వేలి మండల పరిషత్‌కు నూతన అధ్యక్షురాలిగా రాటకొండ కల్పన, ఉపాధ్యక్షురాలిగా పాటూరు సుమలత బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ పాలనలో సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులపై ఉంది. ఏకగ్రీవ ఎన్నికతో మండల పరిషత్‌లో నూతన పాలనా బాధ్యతలకు శ్రీకారం చుట్టినట్లయింది.

మార్చి నుంచే పాదయాత్ర

కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి పాదయాత్ర చర్చ తెరపైకి వచ్చింది. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా అధికారాన్ని తిరిగి దక్కించుకోవాలనే లక్ష్యంతో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల్లోకి వెళ్లేందుకు పాదయాత్రను ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ యాత్ర ఎప్పుడు ప్రారంభమవుతుంది? గతంలో అనుకున్న సమయం కంటే ముందుగానే జగన్ అడుగులు వేయబోతున్నారా? అనే ప్రశ్నలు ఇప్పుడు ఆసక్తిని పెంచుతున్నాయి.వైఎస్సార్ కుటుంబ రాజకీయ ప్రస్థానంలో పాదయాత్రకు ప్రత్యేక స్థానం ఉంది. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి చేపట్టిన ప్రజాప్రస్థానం యాత్ర ఆయన రాజకీయ ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడింది. ఆ తర్వాత జగన్ కూడా పాదయాత్ర ద్వారా ప్రజలకు చేరువయ్యారు. 2017లో ప్రారంభించిన సుదీర్ఘ పాదయాత్ర ఆయనకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడమే కాకుండా, 2019 ఎన్నికల్లో పార్టీ విజయానికి కీలకమైన రాజకీయ వాతావరణాన్ని సృష్టించింది. అందుకే మరోసారి అదే వ్యూహాన్ని అనుసరించాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.గతంలో పార్టీ సమావేశాల్లో చేసిన వ్యాఖ్యలను బట్టి చూస్తే 2027 అక్టోబర్ లేదా నవంబర్ నెలల్లో పాదయాత్ర ప్రారంభం కావచ్చనే అంచనాలు వినిపించాయి. అయితే ఇప్పుడు ఈ ప్రణాళికలో మార్పు వచ్చినట్లు కొత్త ప్రచారం మొదలైంది. అనుకున్న సమయం కంటే దాదాపు ఆరు నెలల ముందుగానే, అంటే 2027 మార్చి నుంచే జగన్ ప్రజా యాత్రకు శ్రీకారం చుట్టవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే దీనిపై పార్టీ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.పాదయాత్రను ముందుకు తీసుకురావాలనే ఆలోచన వెనుక పార్టీ అంతర్గత పరిస్థితులు కూడా ఉన్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌ఛార్జిల పనితీరుపై జగన్ సమీక్ష నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రజల్లో చురుగ్గా ఉండని నాయకులకు బాధ్యతలు అప్పగించడం కంటే, క్షేత్రస్థాయిలో పనిచేసే కొత్త నాయకులకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పాదయాత్ర సమయంలో ఆయా నియోజకవర్గాల్లో నాయకుల పనితీరును నేరుగా పరిశీలించే అవకాశం కూడా ఉంటుంది. యాత్ర నిర్వహణ, స్థానిక కార్యకర్తల సమన్వయం, ప్రజలతో సంబంధాలు వంటి అంశాల్లో బలమైన నాయకత్వం అవసరమని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.మరోవైపు జాతీయ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలు కూడా ఈ చర్చకు కారణంగా మారుతున్నాయి. సాధారణంగా 2029 మే నెలలో లోక్‌సభతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. అయితే దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికల నిర్వహణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆలోచనలు చేస్తున్నట్లు రాజకీయ చర్చలు సాగుతున్నాయి. అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాకపోయినా, కొన్ని రాష్ట్రాల్లో ముందస్తుగా ఎన్నికలు జరిగే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2028 చివరిలోనే ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పరిణామాలు చోటుచేసుకోవచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటే 2027 మార్చిలోనే పాదయాత్ర ప్రారంభించడం జగన్‌కు రాజకీయంగా ఉపయోగపడవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించడంతో పాటు పార్టీని ఎన్నికలకు సిద్ధం చేసుకునేందుకు తగిన సమయం లభిస్తుందని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పాదయాత్ర తేదీలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల మార్పులు, ఎన్నికల వ్యూహంపై వైసీపీ నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతానికి ఇవన్నీ రాజకీయ వర్గాల్లో సాగుతున్న చర్చలుగానే చూడాలి. జగన్ తదుపరి నిర్ణయం ఎలా ఉండబోతుందన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

కైలాసగిరికి కొత్త రోప్‌వే

విశాఖపట్టణం : విశాఖపట్నానికి పర్యాటకుల తాకిడి పెరిగింది.. ముఖ్యంగా నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో పర్యాటకులు ఎక్కువగా తరలివస్తుంటారు. విశాఖపట్నంతో పాటుగా అరకు, పాడేరు, లంబసింగి వంటి ప్రాంతాలకు టూర్ వేస్తుంటారు. నగరంలో పర్యాటకుల కోసం ప్రభుత్వం మర కీలక నిర్ణయం తీసుకుంది. కైలాసగిరికి కొత్త రోప్‌వే నిర్మించే దిశగా అడుగులు పడుతున్నాయి. దాదాపు 20 ఏళ్లుగా ఉన్న పాత రోప్‌వేను తొలగించి కొత్త రోప్‌వే ఏర్పాటు చేయడానికి గతేడాది నుంచి టెండర్లు పిలిచినా ఎవరూ ఆసక్తి చూపించలేదు. అప్పటి నుంచి టెండర్ల ప్రక్రియ ముందుకు సాగలేదు.. వాయిదా పడుతోంది. ఇటీవల బోర్డు సమావేశంలో ప్రస్తుత కాంట్రాక్టరే ఎల్-1గా నిలవడంతో.. వారికే పనులు అప్పగించడానికి ఆమోదం తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశం ఉంది అంటున్నారు.వీఎంఆర్‌డీఏ (విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ) పర్యాటకుల కోసం వినూత్నంగా ఆలోచించింది. 2004లో కైలాసగిరిపైకి వెళ్లడానికి మెట్లు, రోడ్డు మార్గం కాకుండా రోప్‌వేను అందుబాటులోకి తీసుకువచ్చింది.. రూ.3కోట్లతో ఏర్పాటు చేశారు. 2004నాటి రోప్‌వే 20 ఏళ్ల పాటూ ఉంటుంది.. ఇప్పుడు ఆ గడువు కూడా పూర్తయ్యింది. ప్రస్తుతం ఉన్న రోప్‌వే నిర్వహణ సరిగ్గానే ఉంది.. కానీ ఒకవేళ అనుకోని ప్రమాదం జరిగితే పర్యాటకుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని గతంలో విశాఖపట్నం కమిషనర్‌గా పనిచేసిన విశ్వనాథన్.. పాత రోప్‌వే తొలగించి, కొత్త రోప్‌వేను కొండ పైనుంచి తెలుగు మ్యూజియం 1.5 కి.మీ వరకు పెంచాలని ప్రతిపాదించారు.ఈ రోప్‌వేకు సంబంధించి సింగపూర్ తరహాలోనే లూజ్ గ్రావిటీ రైడ్‌ను ఏర్పాటు చేసేందుకు డిజైన్లు రూపొందించారు. కొత్త రోప్‌వే నిర్మాణం కోసం టెండర్లు పిలిస్తే.. కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఆ తర్వాత ఒక్కరే టెండర్ వేశారు.. వాళ్లు కూడా ఖర్చు ఎక్కువగా అవుతుందన్నారు. అందుకేఆదాయంలో వాటా పెంచాలని కోరారు. ఈ క్రమంలో కొత్త రోప్ వే ప్రాజెక్టు ఆగిపోయింది. దీంతో పాత రోప్‌వేను నడుపుతున్నారు. ఇంతలో గతంలో టెండర్ వేసినసంస్థ కొత్ రోప్‌వే నిర్మాణానికి ముందుకు వచ్చింది. అధికారులతో చర్చించిన తర్వాత ఎల్-1 క

నేడు దిల్లీ పబ్లిక్ స్కూల్ నాచారంను సందర్శించనున్న

డీపీఎస్ సొసైటీ ట్రెజరర్ నమితా ప్రధాన్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)దిల్లీ పబ్లిక్ స్కూల్ సొసైటీ గౌరవ కోశాధికారిణి, విశ్రాంత ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారిణి నమితా ప్రధాన్, హైదరాబాద్‌లోని డీపీఎస్ క్యాంపస్‌ల అధికారిక పర్యటనలో భాగంగా నేడు దిల్లీ పబ్లిక్ స్కూల్, నాచారంను సందర్శించనున్నారు.తన పర్యటనలో భాగంగా ఆమె విద్యా ప్రమాణాలు, క్యాంపస్ మౌలిక సదుపాయాలు, కొనసాగుతున్న విద్యా కార్యక్రమాలను సమీక్షిస్తారు. దీంతో పాటు క్యాంపస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అమ్యూజ్‌మెంట్ పార్క్‌ను ప్రారంభించనున్నారు. నమితా ప్రధాన్ మాజీ సీనియర్ ఐఏఎస్ అధికారిణి, అంతర్జాతీయ పరిపాలనా దక్షురాలు,1977 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి అయిన ప్రధాన్, పరిపాలన అంతర్జాతీయ నాయకత్వంలో దశాబ్దాల అనుభవం కలిగి ఉన్నారు. భారత సివిల్ సర్వీసెస్‌లో తన 20 ఏళ్ల పదవీకాలంలో, మహారాష్ట్ర కేంద్ర ప్రభుత్వంలో ముఖ్యంగా ఆరోగ్య, రక్షణ మంత్రిత్వ శాఖలలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. జాతీయ పరిపాలనకు మించి, ఐక్యరాజ్యసమితిలో 15 సంవత్సరాల పాటు అంతర్జాతీయ స్థాయిలో సేవలందించారు. జెనీవాలోని ప్రపంచ ఆరోగ్య సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్, యూఎన్ డెవలప్‌మెంట్ గ్రూప్ వైస్ చైర్ వంటి ఉన్నత పదవులను నిర్వహించడంతో పాటు, యునెస్కో అంతర్జాతీయ అభివృద్ధి కార్యక్రమాలలో కీలక పాత్ర పోషించారు.మల్కా కొమరయ్య, ఎమ్మెల్సీ నాయకత్వంలో తెలంగాణలో విద్యారంగ పరివర్తన డీపీఎస్ నాచారం గ్రూప్ విద్యాసంస్థల గౌరవ ప్రో-వైస్ ఛైర్మన్ మల్కా కొమరయ్య, టీచర్ ఎమ్మెల్సీ ఈ కార్యక్రమానికి నాయకత్వం వహిస్తారు. మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న ప్రముఖ విద్యావేత్తగా, ఆధునిక సాంకేతికత, పరిశోధన విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని మేళవించడం ద్వారా తెలంగాణ అంతటా విద్యాసంస్థలను అత్యుత్తమ కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో ఆయన విస్తృత గుర్తింపు పొందారు.ఈ వేదుకలో ప్రముఖ యువ విద్యావేత్త, డీపీఎస్ గ్రూప్, కె-ఇన్నోవేటివ్, ఎకో భారత్ సీఈఓ మరియు డైరెక్టర్ యశస్వి మల్కా, డీపీఎస్ డైరెక్టర్ త్రిభువన మల్కా, డీపీఎస్ నాచారం ప్రిన్సిపాల్ నందిత సుంకర, స్కూల్ ఇన్‌ఛార్జ్‌లు, అధ్యాపక బృందం, విద్యార్థులతో పాటు ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళులు

సిరిసిల్ల సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం గాంధీ చౌక్ వద్ద మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ దాడుల కలకలం

- నామినేషన్ల వేళ దౌర్జన్యాలు
- ఎస్ఈసీకి టీడీపీ ఫిర్యాదు
- కారం చల్లి.. ఇనుప రాడ్లు, కర్రలతో దాడులు చేశారంటూ ఆరోపణలు
- కడప నుంచి పల్నాడు వరకు ఘటనలు
- వీడియో ఆధారాలతో పెన్‌డ్రైవ్ అందజేత



అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రాజకీయ ఉద్రిక్తతలకు వేదికగా మారిందని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పలుచోట్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ ఎన్నికల ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించింది. కడప, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో చోటుచేసుకున్న ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరింది.ఈ మేరకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేసింది. మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్. రాజశేఖర్, ఏపీ బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ఈ బృందంలో ఉన్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన దాడులు, విధ్వంసాలకు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను కమిషనర్‌కు అందించారు.

నామినేషన్ కేంద్రాల వద్ద దాడులంటూ ఫిర్యాదు..

పల్నాడు జిల్లా మునుగోడులో నామినేషన్ వేసేందుకు వెళ్లిన టీడీపీ నాయకులపై వైసీపీ వర్గీయులు మారణాయుధాలతో దాడి చేశారని, మహిళలతో కారం పొడి చల్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కడప జిల్లా చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లెలో టీడీపీ కార్యకర్తలకు చెందిన రెండు ద్విచక్రవాహనాలు, ఒక కారుకు నిప్పు పెట్టారని ఆరోపించారు తొండూరు మండలం ఆగూడూరు నామినేషన్ కేంద్రం వద్ద రాళ్లు, ఆయుధాలతో దాడి జరగడంతో ఏఎంసీ చైర్మన్ రామ సురారెడ్డి పరిస్థితి విషమంగా మారిందని, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని వివరించారు. మార్కాపురం జిల్లా పీసీపల్లి మండలం పెదఇర్లపాడు ఆర్వో కార్యాలయంలోకి చొరబడిన కొందరు టీడీపీ నేత కొండారెడ్డి భూమిరెడ్డిపై దాడికి యత్నించారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం వెంకటాచలం సర్పంచ్ అభ్యర్థి చిన్న కోటయ్యపై జరిగిన దాడిలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి: వర్ల

ఎస్ఈసీని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ వర్ల రామయ్య.. మునుగోడులో తమ పార్టీ నాయకుడిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. మహిళలను అడ్డుపెట్టుకుని కార్యకర్తల కళ్లలో కారం చల్లి, అనంతరం ఐరన్ రాడ్లు, కర్రలు, బండరాళ్లతో దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో తమ నాయకుడి తలకు 16 కుట్లు పడ్డాయని, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.ఇంతటి తీవ్ర దాడి జరిగినప్పటికీ పోలీసులు సాధారణ గాయాలకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం సరికాదని, హత్యాయత్నానికి సంబంధించిన పాత ఐపీసీ 307 లేదా ప్రస్తుత బీఎన్ఎస్ సెక్షన్ 109 కింద కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, ఆధారాలను ఎన్నికల కమిషనర్‌కు చూపించినట్లు వెల్లడించారు.

పులివెందుల ప్రజలు గుణపాఠం చెప్పారు..

పులివెందులలో గతంలో దొంగ ఓట్లు, రిగ్గింగ్ రాజకీయాలతో గెలుపొందేవారని వైఎస్ కుటుంబాన్ని ఉద్దేశించి వర్ల రామయ్య విమర్శించారు. అయితే ప్రజల్లో చైతన్యం పెరగడంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని, ఫలితంగా వైసీపీ ఓటమి చవిచూసిందని వ్యాఖ్యానించారు. ప్రజాతీర్పును గౌరవించాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు. ఎక్కడ, ఎప్పుడు నామినేషన్లు అడ్డుకున్నారో ఆధారాలతో వివరించాలని కూడా సవాల్ చేశారు.

జైలు ఘటనపైనా చర్యలు తీసుకోవాలి..

గుంటూరు జిల్లాలో రౌడీషీటర్ లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించేందుకు సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వందలాది మంది కార్యకర్తలతో జైలుకు వెళ్లి నిషేధాజ్ఞలు ఉల్లంఘించారని వర్ల రామయ్య ఆరోపించారు. జైలు సిబ్బందిని నెట్టుకుంటూ లోపలికి వెళ్లిన ఘటనలో ఓ పోలీసు అధికారి కాలికి గాయమైందని, అయినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై ప్రశ్నించారు. ఎన్నికలతో సంబంధం లేకుండా చట్టం అందరికీ సమానంగా అమలుకావాలని, ఏ పార్టీకి చెందిన వారైనా హింసకు పాల్పడితే ఉపేక్షించరాదని పోలీసు శాఖను, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకోవాలని టీడీపీ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. అయితే ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలపై సంబంధిత వర్గాల స్పందన, అధికారిక విచారణ వివరాలు వెలువడాల్సి ఉంది.

మానుకోట మార్నింగ్ వాక్‌లో పట్టభద్రులతో

ఆత్మీయ పలకరింపు



మహబూబాబాద్ పట్టణంలోని జూనియర్ కళాశాల, ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ , మాజీ ఎంపీ మాలోతు కవిత ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాక్‌కు వచ్చిన పట్టభద్రులు, నిరుద్యోగ యువత, స్థానిక ప్రజలను ఆత్మీయంగా కలుసుకొని వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నాను. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ , మలోత్ కవిత మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ నిరుత్సాహపడకుండా నిత్యం ప్రజల మధ్య ఉంటూ, పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న యువకుడు, విద్యావంతుడు రాకేష్ రెడ్డికి పట్టభద్రులు అండగా నిలవాలని కోరడం ఎంతో సంతోషాన్నిచ్చింది. కాగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీల అమలులో తీవ్రంగా విఫలమైంది. యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు భరోసా, ఉద్యోగులకు న్యాయం, రైతులకు గిట్టుబాటు ధరలు అందని పరిస్థితి నెలకొందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ బిందు , మాజీ మున్సిపల్ చైర్మన్ రామ్ మోహన్ రెడ్డి , సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భరత్ రెడ్డి , జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి పకడ్బందీ ఏర్పాట్లు

- 18 నుంచి 59 ఏళ్ల వారు అర్హులు - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అధికారులు, సిబ్బందికి ఐడీఓసీలో శిక్షణ

రాజన్న సిరిసిల్ల, నవంబర్ -18 రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల పంచాయతీ అధికారులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, పంచాయతీ సెక్రెటరీలు ఇతర అధికారులకు సిబ్బందికి జిల్లా సమీకృత కార్యాలయం ఆడిటోరియంలో బుధవారం ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 18 నుంచి 59 ఏళ్ల వయసున్న వారికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నదని వెల్లడించారు. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో విడతల వారీగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్జీదారుల నుంచి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ వివరాలు తీసుకుంటారని స్పష్టం చేశారు. బీమా చేయించేవారు నామిని వారి వివరాలు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఒకరు లేదా అంతకంటే ఎక్కువ నామినీలు కూడా ఉండవచ్చని వెల్లడించారు. దరఖాస్తు ఫారంలో సంతకం చేయాలని సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో అధికారులు, సిబ్బంది ప్రత్యేక శిబిరాల వద్ద టెంట్లు, కుర్చీలు, బీమా వివరాల ప్లెక్సీలు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివరాల నమోదు కోసం కంప్యూటర్లు, ఇతర యంత్రాలు, సిబ్బంది హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. మొత్తం ప్రక్రియలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శిబిరాలను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య, జిల్లా ప్రణాళిక అధికారి సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఈడీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

శ్రీశైలంలో ఆధ్యాత్మిక శోభ.. నేడు కోటి దీపోత్సవం

- భక్తిపారవశ్యంలో శ్రీగిరి.. దీపకాంతులతో వెలిగిపోనున్న శైవక్షేత్రం
- మనో బృందంతో భక్తి సంగీత స్వరార్చన - సంప్రదాయ నృత్యాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రత్యేక ఆకర్షణ

శ్రీశైలం(ప్రశ్న న్యూస్) కార్తీకమాస పవిత్ర వేళ శ్రీశైల మహాక్షేత్రం మరో అపురూప ఆధ్యాత్మిక వేడుకకు సిద్ధమవుతోంది. కార్తీకమాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 20వ తేదీన దేవస్థానం ఆధ్వర్యంలో కోటి దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. లక్షలాది దీపాల వెలుగులతో శ్రీగిరి ఆధ్యాత్మిక కాంతులతో విరాజిల్లనుండగా, స్వామిఅమ్మవార్ల దివ్యసన్నిధిలో భక్తి పారవశ్యం వెల్లివిరియనుంది.ఆలయ ఆగమ పాఠశాల ఎదురుగా ఉన్న మైదానంలో సాయంత్రం 6 గంటల నుంచి కోటి దీపోత్సవం నిర్వహించేందుకు ప్రత్యేక వేదికను సిద్ధం చేస్తున్నారు. ఈ మహోత్సవానికి అవసరమైన పూజా ద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే సమకూర్చనుంది. సాయంత్రం 5 గంటల నుంచే ఆధ్యాత్మిక ప్రవచనాలు, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

మనో బృందంతో భక్తి సంగీత స్వరార్చన

ఈ వేదుకల్లో ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు నాగూరుబాబు (మనో), తన బృందంతో నిర్వహించనున్న భక్తి సంగీత స్వరార్చన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. పలువురు ప్రముఖ గాయనీగాయకులు తమ గానామృతంతో భక్తులను ఆధ్యాత్మిక లోకంలో విహరింపజేయనున్నారు. అదేవిధంగా సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకోనున్నాయి.

దశహారతులతో స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు..

కోటిదీపోత్సవ ప్రత్యేక వేదికపై శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు విశేష పూజాదికాలు నిర్వహించనున్నారు. అనంతరం ఓంకారహారతి, నాగహారతి, త్రిశూలహారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభహారతి, నక్షత్రహారతి, కర్పూరహారతి.. ఇలా పది రకాల హారతులను సమర్పించనున్నారు. చివరగా మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచనంతో మహోత్సవాన్ని ముగించనున్నారు.



దీపమే జ్ఞానానికి ప్రతీక..

వైదిక సంప్రదాయంలో దీపానికి విశేష ప్రాధాన్యం ఉందని ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు పేర్కొన్నారు. దీపజ్యోతిని యజ్ఞాగ్నికి సంకేతంగా భావిస్తారని, పవిత్రమైన సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో కోటి దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ జ్ఞానం, వెలుగు, ఉత్సాహం, ఆనందం, శాంతికి దీపం ప్రతీక అని వివరించారు. దీపారాధనతో దివ్యగుణాలను పొందవచ్చని, స్వామిఅమ్మవార్లకు దీపజ్యోతిని సమర్పించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. భక్తులందరూ ఈ మహోత్సవంలో పాల్గొని స్వామిఅమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

నిత్యకళారాధనతో ప్రాచీన కళలకు ప్రోత్సాహం..




మరోవైపు దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళారాధన భక్తులకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక అనుభూతిని అందిస్తోంది. గురువారం హైదరాబాద్‌కు చెందిన శివశ్రీహిత నృత్యాలయ కళాకారుల ఆధ్వర్యంలో సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నారు.

ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదికపై గణేశ పంచరత్న, నమశ్శివాయ, శివాష్టకం, భో శంభో తదితర భక్తిగీతాలకు ప్రవళ్లిక, వింధ్య, సమన్విత తదితర కళాకారులు నృత్య ప్రదర్శనలు చేయనున్నారునిత్యకళారాధనలో భాగంగా హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని వంటి కార్యక్రమాలను వివిధ రోజుల్లో నిర్వహిస్తున్నారు. స్వామిఅమ్మవార్ల కైంకర్యాలు పరిపూర్ణంగా జరగడంతోపాటు ప్రాచీన భారతీయ కళలను పరిరక్షించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం వెల్లడించింది.

ఆంగ్ల నైపుణ్యాలతో ఉజ్వల భవిష్యత్తు

- సాంకేతిక నైపుణ్యాలతో ఉద్యోగ అవకాశాలు
- ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఎంతో అవసరం
- చదవడం, రాయడం, వినడం, మాట్లాడటంపై నిరంతర సాధన చేయాలి
- ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జీవన్ పాలడుగు

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ఆంగ్ల భాషలో పట్టు సాధించడంతోపాటు సాంకేతిక నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు, మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జీవన్ పాలడుగు అన్నారు.హైదరాబాద్‌లోని మలక్‌పేట నవాబ్ షా ఆలేమ్ ఖాన్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం 'ఎఫెక్టివ్ టెక్నికల్ స్కిల్స్ ఇన్ ఇంగ్లీష్' అనే అంశంపై ఆయన ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆంగ్ల భాషా ప్రావీణ్యం, సాంకేతిక నైపుణ్యాల ప్రాధాన్యతను వివరించారు.డాక్టర్ జీవన్ పాలడుగు మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించాలంటే విద్యార్హతలతోపాటు ఆంగ్ల భాషలో కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. ఇందుకోసం విద్యార్థులు ప్రతిరోజూ ఇంగ్లీషులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడటం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ నాలుగు నైపుణ్యాలను నిరంతరం సాధన చేయడం ద్వారా భాషపై పట్టు సాధించవచ్చని తెలిపారు.అలాగే ఉద్యోగ, వ్యాపార రంగాల్లో అవసరమయ్యే సాంకేతిక సమాచారాన్ని స్పష్టంగా వ్యక్తీకరించే సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. అధికారిక లేఖలు, సాంకేతిక నివేదికలు, మెమోరాండాలు, ప్రాజెక్టు ప్రతిపాదనలు, ప్రాజెక్టు వివరాల రూపకల్పన వంటి అంశాల్లో విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆయా అంశాలపై నిరంతర అధ్యయనం, శిక్షణ, సాధన ద్వారా మంచి నైపుణ్యాలను అలవర్చుకోవచ్చన్నారు. విద్యార్థులు సమయపాలన, ఏకాగ్రతతో తమ లక్ష్యాల వైపు ముందుకు సాగాలని, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు ఆంగ్ల భాషలో మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఎల్ఎస్ఆర్‌డబ్ల్యూ నైపుణ్యాలైన లిజనింగ్ (వినడం), స్పీకింగ్ (మాట్లాడడం), రీడింగ్ (చదవడం), రైటింగ్ (రాయడం) భాషాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని వివరించారు.ఈ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను ప్రదర్శించగలరని, తద్వారా ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, ఆంగ్ల విభాగాధిపతి, పరీక్షల నియంత్రణ అధికారి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాస్ యాక్షన్ విందుతో బెల్లంకొండ 'టైసన్ నాయుడు' టీజర్.!



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో, దర్శకుడు సాగర్ కె. చంద్ర తెరకెక్కిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో పవర్‌ఫుల్ లుక్‌తో కనిపించనున్నారు. నేహా శెట్టి, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో నరేష్, రావు రమేష్, సునీల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'మదరాసి రబ్బరు బొమ్మ' పాటకు మంచి స్పందన లభించగా, తాజా టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. త్వరలోనే చిత్ర విడుదల తేదీపై మేకర్స్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

సేయాన్‌లో విరుమాండి గెటప్..

అతిథి పాత్రలో కనిపించనున్న కమల్‌హాసన్..!



అగ్ర కథానాయకుడు కమల్‌హాసన్ ప్రస్తుతం సండియర్, ఇండియన్-3తో పాటు రజనీకాంత్‌తో కలిసి నటిస్తున్న మల్టీస్టారర్ చిత్రాలతో బిజీగా ఉన్నారు. మరోవైపు నిర్మాతగా కూడా భారీ ప్రాజెక్ట్‌లను చేపడుతున్నారు. శివకార్తికేయన్ హీరోగా నటిస్తున్న 'సేయాన్' చిత్రానికి ఆయన సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో కమల్‌హాసన్ కీలకమైన అతిథి పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. విశేషమేమిటంటే..2004లో వచ్చిన తన కల్ట్‌క్లాసిస్ చిత్రం 'విరుమాండి'లోని ఐకానిక్ గెటప్‌లో ఆయన దర్శనమివ్వనున్నారని సమాచారం. సినిమా పతాకఘట్టాల్లో కమల్‌హాసన్ ఎంట్రీ ఉంటుందట. ఇందుకోసం ఆయన 'విరుమాండి'లోని లుక్‌ని రీక్రియేట్ చేయనున్నారని తెలిసింది. ఈ సినిమా కథాపరంగా మురుగన్, విరుమాండి అనే దైవిక పాత్రల చుట్టూ నడుస్తుందని చెబుతున్నారు. ఇందులో శివకార్తికేయన్ మురుగన్ పాత్రలో, కమల్‌హాసన్ విరుమాండిగా కనిపించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నది. ఒకవేళ ఈ వార్తలు నిజమైతే సినిమాలో విరుమాండి గెటప్ ప్రత్యేకాకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది.

'వారణాసి' రిలీజ్ డేట్ మారనుందా?



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న 'వారణాసి' సినిమాపై అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ ఇటీవలే షూటింగ్‌ను పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా విడుదల తేదీ మారే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. తొలుత ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం వచ్చే ఏడాది జూలై 30న రిలీజ్ చేయబోతున్నట్లు తెలిసింది.దర్శకుడు రాజమౌళి తన ప్రతి సినిమాను విజువల్‌గా కొత్త స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుంటారు. సినిమా నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో సినిమాను తీర్చిదిద్దుతారు. 'వారణాసి' విషయంలో ఆయన మరింతగా శ్రద్ధ తీసుకుంటున్నారని, అందుకే రిలీజ్ డేట్ వాయిదా పడే అవకాశం ఉందని ఫిల్మ్‌నగర్ టాక్. అయితే ఈ విషయంలో వాస్తవమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

తండ్రీకూతుళ్ల కథతో కింగ్ 100?



అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున నూరవ చిత్రం 'కింగ్ 100' ఇంకొన్ని వారాల్లో విడుదల కానున్నది. దీంతో ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ల కోసం ఆడియన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా ఈ సినిమా కథకు సంబంధించిన ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. ఇది తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో సాగే కథట. ఇందులో నాగార్జున కూతురుగా సుష్మిత భట్ నటిస్తున్నారు. వారిద్దరి పాత్రల ఎమోషన్సే సినిమాకు ప్రధాన బలమట. ఇక టబు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఇందులో ఆమె మహంతి ఝాన్సీరాణిగా ప్రతినాయిక పాత్రలో కనిపిస్తారట. ఒకప్పటి రొమాంటిక్ జోడీ అయిన నాగార్జున, టబు.. ఈ సినిమాలో హీరో, విలన్‌గా కనిపించడం ఆసక్తికరమైన విషయం. కథాపరంగా వీరిద్దరి మధ్య భీకరమైన పోరు ఉండబోతున్నదని ఇన్‌సైడ్ టాక్. ఇంకా ఐశ్వర్యరాజేష్, అశోక్ సెల్వన్, రవీంద్ర విజయ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా విడుదల కానున్నది. ఈ చిత్రానికి కెమెరా: రాజా మహదేవన్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాణం: అన్నపూర్ణ స్టూడియోస్, దర్శకత్వం: రా.కార్తీక్.

ఎనిమిదేండ్లు వెనక్కి వెళ్లారు



"ఈ నగరానికి ఏమైంది' సినిమా తీసినప్పుడు ఎలాంటి లెక్కలు వేసుకోలేదు. నా మనసుకి అనిపించింది నేను చేశాను. ఆ సినిమా రీరిలీజ్ సందర్భంగా ఆడియెన్స్ ఇచ్చిన రెస్పాన్స్‌తో ఒళ్లు దగ్గర పెట్టుకొని 'ఈఎన్‌ఈ' రిపీట్ తీశాను' అన్నారు తరుణ్‌భాస్కర్. ఆయన దర్శకత్వంలో విశ్వక్‌సేన్, అభినవ్ గోమటం, శ్రీనాథ్ మాగంటి, వెంకటేష్ కాకుమాను, అనీషా ఆంబ్రోస్, శివాత్మిక రాజశేఖర్ ప్రధాన పాత్రల్లో రూపొందిన 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' (ఈఎన్ఈ రిపీట్) నేడు విడుదలవుతున్నది.మంగళవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా తరుణ్‌భాస్కర్ మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. "ఈ నగరానికి ఏమైంది' వచ్చి ఎనిమిదేళ్లవుతుంది. ఈ సమయంలో విశ్వక్‌సేన్, అభినవ్ ఎంతో ఎదిగారు. కానీ ఈ సినిమా కోసం మళ్లీ ఎనిమిదేండ్లు వెనక్కి వెళ్లారు. ఒక్క శుక్రవారం కోసం ఈ సినిమా చేయలేదు. భవిష్యత్తు తరాలు కూడా చూసి ఎంజాయ్ చేసేలా తెరకెక్కించాను' అని తరుణ్‌భాస్కర్ తెలిపారు. తన కెరీర్‌లోనే మైలురాయిలా నిలిచే చిత్రమిదని విశ్వక్‌సేన్ చెప్పారు. యువతతో పాటు ఫ్యామిలీస్ అందరూ సెలబ్రేట్ చేసుకునేలా ఈ సినిమా ఉంటుందని నిర్మాతలు సృజన్ ఎరబోలు, సందీప్ నాగిరెడ్డి పేర్కొన్నారు.

ఫులేరా గ్రామానికి మళ్లీ స్వాగతం

కొత్త సీజన్‌తో రాబోతున్న 'పంచాయత్'

గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన మోస్ట్ అవేటెడ్ కామెడీ వెబ్ సిరీస్ 'పంచాయత్' సీజన్ 5 త్వరలోనే అలరించడానికి సిద్ధమవుతోంది. డిసెంబర్ 3న ప్రముఖ ఓటీటీ వేదిక



అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ కొత్త సీజన్ గ్రాండ్‌గా స్ట్రీమింగ్ కానుంది. ఫులేరా గ్రామ ఎన్నికల రాజకీయాలు, ఊహించని పరిణామాలు ప్రేక్షకులకు కడుపుబ్బా నవ్వించడంతో పాటు ఉత్కంఠను పంచనున్నాయి. ఈ తాజా సీజన్‌లో జితేంద్ర కుమార్ (అభిషేక్), రఘుబీర్ యాదవ్ (ప్రధాన్ జీ), నీనా గుప్తా (మంజు దేవి), అశోక్ పాఠక్ తదితరులు తమ అద్భుతమైన నటనతో మరోసారి మ్యాజిక్ చేయనున్నారు. గత సీజన్ ముగింపులో ఫులేరా రాజకీయాల్లో ఊహించని భూకంపమే వచ్చింది. దశాబ్దాలుగా గ్రామ రాజకీయాలను శాసించిన ప్రధాన్ జీ, ఆయన భార్య మంజు దేవి ఎన్నికల్లో ఊహించని ఓటమిని చవిచూశారు. వారి స్థానంలో ప్రత్యర్థి క్రాంతి దేవి గ్రామ కొత్త ప్రధాన్‌గా పగ్గాలు చేపట్టగా, ఆమె భర్త భూషణ్ అలియాస్ 'బన్‌రాకాస్' తెరవెనుక చక్రం తిప్పుతూ మరింత పవర్‌ఫుల్‌గా మారారు. దీంతో కొత్త పాలకుల రాకతో గ్రామ కార్యదర్శి అభిషేక్‌కు కష్టాలు మొదలవుతాయి. ప్రతీకార ధోరణితో వ్యవహరించే కొత్త నాయకత్వం మధ్య అభిషేక్ పడే పాట్లు నవ్వులు పూయిస్తాయి. మరోవైపు, తన కల అయిన ఎంబీఏ (వీడియో) పూర్తి చేయడానికి సిద్ధమవుతున్న అభిషేక్.. గ్రామంలో ఇంకా ఏయే సమస్యలకు ముగింపు పలుకుతాడు? బన్‌రాకాస్ అల్లరి ఏ స్థాయిలో ఉంటుంది? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సీజన్ సాగనుంది. మొదటి సీజన్ నుంచి ఇప్పటివరకు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూ వస్తున్న 'పంచాయత్' సిరీస్, ఇప్పుడు ఐదవ సీజన్‌తో మరింత వినోదాన్ని పంచేందుకు వస్తోంది. డిసెంబర్ 3 కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు!

అందుకే టాలీవుడ్‌కు దూరం..!

- క్లారిటీ ఇచ్చిన శ్రీలీల

అచ్చ తెలుగందం శ్రీలీల గత కొంతకాలంగా తెలుగు సినిమాలను తగ్గించింది. దీంతో ఆమె టాలీవుడ్‌కు దూరమవుతున్నదా అని అభిమానుల్లో చర్చ మొదలైంది. తాజా ఇంటర్వ్యూలో ఈ ప్రశ్నకు సమాధానమిచ్చిందీ భామ. మెడిసిన్ చదువు, ఇంటర్న్‌షిప్ కారణంగా రెండేళ్ల పాటు ముంబయిలో ఉండాల్సి రావడంతో తెలుగులో కొత్త సినిమాలను అంగీకరించలేకపోయానని చెప్పింది. అంతకుమించి తెలుగుకు దూరం కావడానికి పెద్ద కారణాలు లేవని వివరించింది. సినిమాల జయాపజయాల గురించి మాట్లాడుతూ 'చాలా చిన్న వయసులో నటిగా ప్రయాణాన్ని మొదలుపెట్టాను. కెరీర్ తొలిరోజుల్లో సినిమాల ఎంపిక విషయంలో నాకు పెద్దగా స్వేచ్ఛ ఉండేది కాదు. తొలిరోజుల్లో వచ్చిన అవకాశాలను అంగీకరిస్తూ ముందుకెళ్లా. కొన్ని సినిమాల తర్వాత తప్పులు ఎక్కడ జరుగుతున్నాయో అర్థమైంది. ఇప్పుడు సినిమాల ఎంపికలో పరిణతి వచ్చింది' అని శ్రీలీల చెప్పింది.



కల్పనాచావ్లా స్ఫూర్తితో

కథ రాసుకున్నా!



'ప్రస్తుతం సమాజంలో నెగెటివిటీ పెరిగిపోయింది. ఈ సినిమా చూసిన తర్వా త మనజీవితంలో కూడా కృష్ణలాం టి ఓ వ్యక్తి ఉంటే ఎంత బాగుంటుందో అని ప్రేక్షకులు అనుకుంటారు' అన్నారు దర్శకుడు పవన్ సాధినేని. ఆయన నిర్దేశకత్వంలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి జంటగా నటించిన 'ఆకాశంలో ఒక తార' చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం దర్శకుడు పవన్‌సాధినేని విలేకరులతో సినిమా విశేషాలను పంచుకున్నారు. వ్యోయగామి కావాలనే ఓ అమ్మాయి కలను సాకారం చేసేందుకు కృష్ణ అనే వ్యక్తి ఎలాంటి ప్రయత్నాలు చేశాడన్నదే చిత్ర కథాంశమని తెలిపారు. ప్రతీ ఒక్కరి జీవితంలో ఆశను చిగురింపజేసే కథ ఇదని పేర్కొన్నారు. 'ఇది యూనివర్సల్ కథ. అన్ని భాషల వారికి కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా కోసం రెండేళ్లపాటు పరిశోధన చేశా. ఇస్రో శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లను కలిసి వాళ్ల సలహాలను తీసుకున్నా. దాదాపు ఏడాదిన్నర ప్రీప్రొడక్షన్స్‌కే పట్టింది' అని చెప్పారు. కరోనా లాక్‌డౌన్ టైంలో కల్పనా చావ్లా బయోగ్రఫీ చదువుతున్నప్పుడే ఈ కథకు బీజం పడిందని పవన్‌సాధినేని తెలిపారు. 'ఆ పుస్తకం చదువుతున్నప్పుడు కల్పనా చావ్లా ప్రయాణం కంటే ఆమెపై భర్తకు ఉన్న ప్రేమ నన్ను ఎక్కువగా ఆకట్టుకుంది. అదే స్ఫూర్తితో ఈ కథ తయారు చేశా' అని ఆయన వివరించారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా గంట్ల రాజిరెడ్డి

శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం



శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్) తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా శేరిలింగంపల్లి కి చెందిన సీనియర్ జర్నలిస్టు గంట్ల రాజిరెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన గంట్ల రాజిరెడ్డిని బుధవారం శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చందనగర్ లోని పి జె ఆర్ స్టేడియంలో నిర్వహించిన కార్యాక్రమనికి రాష్ట్ర నాయకులు ఫైళ్ల విఠల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్టు జగన్ రెడ్డి లతో పాటు జర్నలిస్టులు హాజరై గంట్ల రాజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ?ఈ సందర్భంగా గంట్ల రాజిరెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు తదితర సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులతో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని రాజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యభిచార దందా గుట్టురట్టు

ఆలయ రెసిడెన్సీ హోటల్‌పై పోలీసుల దాడి

ఇద్దరు మహిళలు, విటుడు అరెస్ట్. హోటల్ మేనేజర్‌పై కేసు నమోదు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పట్టణంలోని పానగల్ రోడ్డులో ఉన్న 'ఆలయ రెసిడెన్సీ' హోటల్‌లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార దందాను శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు భగ్నం చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మికంగా దాడులు నిర్వహించి ఇద్దరు మహిళలతో పాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వన్ టౌన్ సీఐ వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పానగల్ రోడ్డులోని ఆలయ రెసిడెన్సీ లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసు సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఇద్దరు మహిళలతో పాటు చెంచయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.పోలీసుల ప్రాథమిక విచారణలో హోటల్ మేనేజర్ గంధం కిషోర్ బయటి ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువచ్చి ఈ అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని సీఐ వెల్లడించారు. డబ్బు ఆశ చూపి అమాయక మహిళలను మోసగించి ఈ కార్యకలాపాల్లోకి దింపుతున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు.నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలోని లాడ్జీలు, హోటళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.పుణ్యక్షేత్ర పట్టణంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పోలీసులు మరింత కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తెలిపారు. ధాన్యం సేకరణ కోసం జిల్లాలో ఇప్పటివరకు ఐకేపీ ఆధ్వర్యంలో 113, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 108, మెప్మా ఆధ్వర్యంలో 6 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. ధాన్యం సేకరణ కోసం ఇప్పటికే 26 రైస్ మిల్లులు, ప్రభుత్వ ప్రత్యామ్నాయ గోదాములు సిద్ధంగా పెట్టామని వెల్లడించారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం శుభ్రం చేసి,17 శాతం తేమ ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పిలుపు నిచ్చారు.

డిసెంబర్ 11 వ తేదీ నుంచి ఖేలో ఇండియా పోటీలు

- కలెక్టర్ గరిమ అగ్రవాల్



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 8వ ఎడిషన్ ఖేలో ఇండియా నేషనల్ యూత్ గేమ్స్ - 2026 లోగో, మస్కట్ గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఆవిష్కరించారు. సెల్ఫీ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్ ఫోటో దిగారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్ తో పాటు వరంగల్, నిజామాబాదు, ఖమ్మం, మహబూబ్ నగర్, కరీంనగర్ పట్టణాలలో జాతీయ యువజన క్రీడలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలియజేశారు. రాష్ట్రం లో నిర్వహిస్తున్న జాతీయ క్రీడలకు జిల్లాలోని యువత, క్రీడాకారులకు అవగాహన కల్పించడానికి, విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. క్రీడలకు సంబందించిన లోగో, మస్కట్ లను జిల్లాలోని క్రీడా ప్రాంగణాలు, బస్సు స్టాండ్స్ వద్ద ప్రధాన కూడళ్ళలో కటౌట్లు, బ్యానర్లు, పోస్టర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రామ్ రెడ్డి , డీటీసీపీఓ అన్సార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సీపీఓ సంపత్ కుమార్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఏ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

విభజన ధోరణులు పెరుగుతున్న నేపథ్యంలో

సామాజిక స్థిరత్వ నిర్మాణం

ఏ దేశమైనా, సమాజమైనా అంతర్గతంగా బలంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. భిన్నాభిప్రాయాలు, విభిన్న ఆలోచనలు లేని సమాజం బలమైన సమాజం కాదు. భిన్నత్వాలను వివేకంతో, పరస్పర గౌరవంతో, ఉమ్మడి సంక్షేమం పట్ల నిబద్ధతతో సమర్థవంతంగా నిర్వహించగలిగే సమాజమే నిజమైన బలమైన సమాజం. భారతదేశం అనాదిగా వివిధ మతాలు, భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయంగా ఉంది. తరతరాలుగా భారతీయులు తమ తమ ప్రత్యేక గుర్తింపులను కాపాడుకుంటూనే కలిసిమెలిసి జీవించే సంప్రదాయాన్ని అలవర్చుకోవడం వల్ల ఈ వైవిధ్యమే దేశానికి బలంగా మారింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న సమాచార సాంకేతికత, సామాజిక మాధ్యమాల ప్రస్తుత కాలంలో విభజన ధోరణులను ఎదుర్కొంటూ సామాజిక స్థిరత్వాన్ని బలోపేతం చేయడం ప్రతి పౌరుడు, సామాజిక నాయకుడు, విద్యాసంస్థ, పౌర సమాజం యొక్క ఉమ్మడి బాధ్యత.సామాజిక విభజన అనేది సాధారణంగా పెద్దపెద్ద విభేదాలతో ప్రారంభం కాదు. పరస్పర విశ్వాసం క్రమంగా తగ్గిపోవడం నుంచే మొదలవుతుంది. అపోహలు, పుకార్లు, ఏకపక్ష సమాచారం, భావోద్వేగాలను రెచ్చగొట్టే కథనాలు సకాలంలో అరికట్టకపోతే సమాజంలోని వివిధ వర్గాల మధ్య దూరాన్ని పెంచుతాయి. నిరంతర పరస్పర సంబంధాలు, బహిరంగ చర్చలు, పరస్పర అవగాహనను ప్రోత్సహించే సమాజాలు ఇటువంటి విభజన ధోరణులను సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతాయి. విభేదాలు తలెత్తకముందే బలమైన సామాజిక సంబంధాలను నిర్మించుకోవడం సామాజిక సామరస్యాన్ని కాపాడుకోవడానికి ఒక సమర్థవంతమైన మార్గం.భిన్నాభిప్రాయాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం పరిణతి చెందిన, బాధ్యతాయుతమైన సమాజానికి నిదర్శనం. ప్రజాస్వామ్య వ్యవస్థలో, సమాజంలో విభిన్న అభిప్రాయాలు ఉండటం సహజం. అయితే, ఆ భిన్నాభిప్రాయాలు తప్పనిసరిగా శత్రుత్వానికి దారితీయాల్సిన అవసరం లేదు. గౌరవప్రదమైన చర్చలు ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి, అపోహలను తొలగించుకోవడానికి, తమ ప్రత్యేక గుర్తింపులు లేదా విశ్వాసాలకు భంగం కలగకుండా ఉమ్మడి అభిప్రాయానికి రావడానికి అవకాశం కల్పిస్తాయి. ఇతరుల అభిప్రాయాలను ఓపికగా వినడం, మర్యాదపూర్వకంగా మాట్లాడటం, భిన్నాభిప్రాయాలు కలిగిన వారి గౌరవాన్ని కాపాడటం ద్వారా విభేదాలు సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయకుండా ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేసే వాతావరణం ఏర్పడుతుంది.సామాజిక సామరస్యాన్ని పెంపొందించడంలో మత, సామాజిక నాయకుల పాత్ర అత్యంత కీలకమైనది. వారి ప్రభావం ప్రార్థనా మందిరాలకే పరిమితం కాకుండా కుటుంబాలు, పరిసర ప్రాంతాలు, ప్రజల దైనందిన జీవితాలపై కూడా ఉంటుంది. బాధ్యతాయుతమైన చర్చలను ప్రోత్సహించడం, పుకార్లను నిరుత్సాహపరచడం, సానుభూతి, పరస్పర సహకార భావనలను పెంపొందించడం, ఉమ్మడి నైతిక విలువలను ప్రజలకు గుర్తుచేయడం ద్వారా సమాజం వివిధ సవాళ్లను సహనం, వివేకంతో ఎదుర్కొనేలా వారు దోహదపడగలరు. వివిధ మతాలకు చెందిన నాయకులు పరస్పరం సహకరించుకోవడం ద్వారా శాంతియుత సహజీవనం సాధ్యమే కాకుండా సమాజానికి ఎంతో ప్రయోజనకరమనే సందేశాన్ని ఆచరణలో చూపించవచ్చు.స్థానిక స్థాయిలో చేపట్టే శాంతి, సామరస్య కార్యక్రమాలు సామాజిక సంబంధాలను బలోపేతం చేయడానికి ఆచరణాత్మక అవకాశాలను కల్పిస్తాయి. అంతర్మత సమావేశాలు, కాలనీల స్థాయి సమావేశాలు, సంయుక్త పారిశుద్ధ్య కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు వంటి కార్యక్రమాలు ప్రజలను భిన్నత్వాలకు అతీతంగా ఉమ్మడి లక్ష్యాల కోసం ఏకం చేస్తాయి. తమ ప్రాంత అభివృద్ధి కోసం పౌరులు కలిసికట్టుగా పనిచేసినప్పుడు పరస్పర సహకారం, ఉమ్మడి అనుభవాల ద్వారా విశ్వాసం సహజంగానే పెరుగుతుంది.విభజన ధోరణులను ఎదుర్కొంటూ బలమైన సమాజ నిర్మాణంలో విద్యాసంస్థలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు కేవలం విద్యాబోధనకే పరిమితం కావు. అవి బాధ్యతాయుతమైన పౌరసత్వం, రాజ్యాంగ విలువలు, పరస్పర గౌరవం వంటి లక్షణాలను కూడా విద్యార్థుల్లో పెంపొందిస్తాయి.సామూహిక విద్యా కార్యకలాపాలు, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, హుందాగా జరిగే చర్చలు, సామాజిక సేవా కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా యువతలో వైవిధ్యం పట్ల గౌరవం, జాతీయ సమైక్యతా భావన బలపడతాయి.జాతీయ పండుగలు, ముఖ్యమైన జాతీయ దినోత్సవాల్లో అందరూ కలిసికట్టుగా పాల్గొనడం కూడా ఐక్యతను పెంపొందించడానికి సమర్థవంతమైన మార్గం. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవం, జాతీయ ఐక్యతా దినోత్సవం వంటి సందర్భాల్లో ప్రజలందరూ కలిసి పాల్గొనడం ద్వారా భాష, మతం, సంస్కృతులు వేరైనా మనందరికీ ఉమ్మడి జాతీయ గుర్తింపు, రాజ్యాంగ నిబద్ధత ఉన్నాయని గుర్తుచేస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి విలువలను ఈ సందర్భాలు పునరుద్ఘాటిస్తూ దేశ ప్రజలందరినీ ఒక బలమైన బంధంతో అనుసంధానిస్తాయి.భారతదేశ జాతీయ నాయకుల జీవితాలను, వారి సేవలను స్మరించుకోవడం కూడా ఈ ఉమ్మడి జాతీయ భావనను మరింత బలోపేతం చేస్తుంది. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ భీంరావ్ అంబేద్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం తదితర అనేకమంది మహనీయులు విభిన్న మార్గాలను అనుసరించినప్పటికీ, భారతదేశ అభివృద్ధి, శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేశారు. వారి జీవితాలను అధ్యయనం చేయడం ద్వారా వ్యక్తిగత లేదా వర్గ ప్రయోజనాల కంటే సేవాభావం, నిజాయితీ, ధైర్యం, జాతీయ బాధ్యత వంటి విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలనే స్ఫూర్తి ప్రజల్లో కలుగుతుంది.

సామాజిక సమ్మిళిత కార్యక్రమాలు కూడా దీర్ఘకాలిక సహకారానికి అవకాశాలను కల్పిస్తాయి. యువత నాయకత్వ శిక్షణా కార్యక్రమాలు, క్రీడా పోటీలు, సాహిత్య ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వారసత్వ సంపదపై అవగాహన కార్యక్రమాలు, వ్యాపార రంగంలో మార్గదర్శకత్వం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు వివిధ నేపథ్యాలకు చెందిన ప్రజలు ఉమ్మడి లక్ష్యాల కోసం కలిసి పనిచేసే అవకాశాన్ని కల్పిస్తాయి. ఇటువంటి కార్యక్రమాలు స్నేహభావం, పరస్పర విశ్వాసం, వృత్తిపరమైన సహకారాన్ని పెంపొందించడంతో పాటు అపోహలు, పక్షపాత భావనలు ఏర్పడే అవకాశాలను తగ్గిస్తాయి. సామాజిక వైఖరులను రూపొందించడంలో కుటుంబాల పాత్ర కూడా ప్రాథమికమైనది. పొరుగువారిని గౌరవించడం, వైవిధ్యాన్ని విలువైనదిగా భావించడం, భారతదేశ ఉమ్మడి జాతీయ వారసత్వం పట్ల గర్వపడటం వంటి లక్షణాలను కుటుంబంలోనే నేర్చుకున్న పిల్లలు భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారు. వారు పక్షపాత భావనలను తిరస్కరిస్తూ సానుకూల సామాజిక సంబంధాలను ప్రోత్సహిస్తారు. దయ, ఆతిథ్యం, ఇరుగుపొరుగు వారితో సత్సంబంధాలు వంటి రోజువారీ జీవితంలోని చిన్నచిన్న చర్యలు సాధారణంగా కనిపించినప్పటికీ, అవి సమాజంలోని బంధాలను నిశ్శబ్దంగా బలోపేతం చేస్తాయి.సాంకేతిక పరిజ్ఞానంలో వేగవంతమైన పురోగతి సామాజిక విలువలపై గణనీయమైన, దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతోంది. నేటి వేగవంతమైన జీవన విధానంలో సాంకేతికత ఆకర్షణకు దూరంగా ఉండటం అసాధ్యం. అయితే, సాంకేతికతను సరైన రీతిలో, బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం ద్వారానే అభివృద్ధి దిశగా ముందుకు సాగడానికి మార్గం సుగమమవుతుంది. సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించుకుంటే అది సామాజిక సామరస్యాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనంగా మారుతుంది. వివిధ సామాజిక వర్గాల మధ్య సహకారానికి సంబంధించిన విజయవంతమైన ఉదాహరణలను ప్రచారం చేయడానికి, సానుకూల సామాజిక కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడానికి, నిర్మాణాత్మక చర్చలను ప్రోత్సహించడానికి డిజిటల్ వేదికలు విస్తృత అవకాశాలను కల్పిస్తున్నాయి. అదే సమయంలో, బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తనలో భాగంగా ఏదైనా వార్త లేదా సమాచారాన్ని ఇతరులకు పంపించే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలి. రెచ్చగొట్టే సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా ఉండాలి. ఘర్షణలకు బదులుగా చర్చలు, సంభాషణలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

విభజన ధోరణులను ఎదుర్కొంటూ సామాజిక స్థిరత్వాన్ని నిర్మించడం అనేది రోజువారీ జీవితంలో విశ్వాసం, సహకారం, పరస్పర గౌరవం వంటి అలవాట్లను పెంపొందించుకోవడం ద్వారానే సాధ్యమవుతుందని మనం గుర్తించాలి. పాఠశాలలు, పరిసర ప్రాంతాలు, కార్యాలయాలు, సామాజిక సంస్థలు, ప్రజా జీవితంలో పౌరులు ఉమ్మడి బాధ్యతా భావంతో ఒకరితో ఒకరు అనుసంధానమైనప్పుడు సమాజం మరింత బలపడుతుంది. సంభాషణలను ప్రోత్సహించడం, స్థానిక శాంతి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం, సామాజిక సమ్మిళిత కార్యక్రమాల్లో పాల్గొనడం, జాతీయ వేడుకలను కలిసికట్టుగా జరుపుకోవడం, భారత జాతీయ నాయకుల జీవితాల నుంచి స్ఫూర్తి పొందడం ద్వారా విభేదాల కంటే బలమైన సామాజిక బంధాలను నిర్మించుకోవచ్చు.

ఇటువంటి సామాజిక స్థిరత్వం కేవలం సామరస్యాన్ని కాపాడటమే కాకుండా, మరింత శాంతియుతమైన, ఐక్యమైన, సమ్మిళిత భారతదేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇక్కడ వైవిధ్యమే దేశానికి గొప్ప బలంగా కొనసాగుతుంది. ఇదే మన దేశపు గొప్ప ప్రత్యేకత, మనమందరం గర్వించదగిన జాతీయ గుర్తింపు.

నవ కంటోన్మెంట్ లో "నయా వర్క్"-ఎమ్మెల్యే

- ప్రతి బస్తీకీ శాశ్వత వసతులే 'నవ కంటోన్మెంట్'అసలైన రూపం:ఎమ్మెల్యే శ్రీగణేష్ - బాపూజీ నగర్‌లో పర్యటన సమస్యలపై ఆరా ఎమ్మెల్యే

- రక్షణ శాఖ అనుమతుల జాప్యంపై గుర్రు.. బోర్డు విలీనమే అన్నింటికీ పరిష్కారం:శ్రీ గణేష్ - అభివృద్ధిలో రాష్ట్రం,దేశం ముందు వరుసలో ఉంటే

- సికింద్రాబాద్ కంటోన్మెంట్ మాత్రం సమస్యల కేంద్ర బిందువుగా మారింది.?



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ఎమ్మెల్యే,ఎంపీ నిధులతో కొన్ని చిన్నపాటి పనులు చేపట్టడం కాకుండా, నియోజకవర్గంలోని ప్రతి బస్తీకి నాణ్యమైన,దీర్ఘకాలిక మౌలిక సదుపాయాలను అందించినప్పుడే అసలైన ప్రగతి సాధ్యమవుతుందని స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు.ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించే దిశగా 'నవ కంటోన్మెంట్' నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు.నిన్న బాపూజీ నగర్ బస్తీలోని గల్లీ,గల్లీ తిరుగుతూ స్థానికులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ క్రమంలో తమ ప్రాంతంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికితీసుకురాగా,ఆయన తక్షణమే స్పందించారు. బోయిన్ పల్లి విద్యుత్ శాఖ అధికారులతో స్థానికంగా నెలకొన్న సమస్యపై ఆరా తీశారు.అలాగే కొన్ని జఠిలంగా ఉన్న ఇబ్బందులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు.అనంతరం శ్రీగణేష్ విలేకరులతో మాట్లాడుతూ,

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు రావడంతో న్యాయం జరుగుతుందో లేదో అని తానే స్వయంగా వారి వద్దకు వెళ్లి అక్కడిక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు.అలాగే కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సీసీ రోడ్లు, సీవరేజ్ లైన్ల ఏర్పాటుకు నిరంతరం శ్రమిస్తున్నట్లు చెప్పారు.గతంలో మల్కాజిగిరి ఎంపీగా పనిచేసిన అనుభవం ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులపై పూర్తి అవగాహన ఉందని ఎమ్మెల్యే కొనియాడారు.

కంటోన్మెంట్ అభివృద్ధి కోసం కేంద్రానికి వెళ్లాల్సిన సుమారు రూ.338 కోట్ల నిధులను బోర్డుకు దక్కేలా సీఎం ప్రత్యేక చొరవ చూపారని,ఆ నిధులతో నాలాలు,డ్రైనేజీ పనులు చేపట్టేలా మార్గదర్శకాలు జారీ అయ్యాయని వివరించారు.అలాగే ట్రాఫిక్ రద్దీని నివారించే ఎలివేటెడ్ కారిడార్ల అంశం పై కేంద్ర రక్షణ శాఖ మంత్రితో ముఖ్యమంత్రి సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు.గతంలో నిధుల కొరత ఉండేదని,ఇప్పుడు నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రతి పనికి రక్షణ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం పొందాల్సి రావడం వల్ల పనులు ముందుకు సాగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కంటోన్మెంట్ బోర్డు విలీన ప్రక్రియ పూర్తయితే పరిపాలన గాడిలో పడి,అభివృద్ధి పనులు పరుగులు పెడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.అర్హత ఉండి ఇప్పటివరకు పింఛన్లు అందని వారు మరోమారు దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి అర్హుడికీ న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

అదేవిధంగా చిన్న ఇళ్లు, గుడిసెల్లో నివసించే నిరుపేదలు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముప్పిడి మధుకర్,వార్డు-1 కాంగ్రెస్ అధ్యక్షుడు మారుతి గౌడ్, మహిళా కాంగ్రెస్ వార్డు అధ్యక్షురాలు గోమతి, సీనియర్ నేతలు బలవంత రెడ్డి,సదానంద్,హరికృష్ణ, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమిటీ సభ్యులు శరత్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ భూదందాలో
అధికారుల వాటా ఎంత.?

- పత్రికలో కథనాలు వచ్చిన కలెక్టర్ మౌనమెందుకు.?
- మామూళ్లతో అధికారులు బాధ్యతలు విస్మరించారా.?
- ఆర్డీవో దృష్టికి వెళ్లిన చర్యలు లేకపోవడం వెనుక సెటిల్మెంట్ కారణమా.?
- ఎమ్మార్వో ఆశీర్వాదంతో పూర్తయిన అక్రమ నిర్మాణాలు
- కబ్జాకు సహకరించిన ఎమ్మార్వో , ఆర్ ఐ అంటూ ఆరోపణలు
- రెవిన్యూ అధికారులకు లంచాలు ఇచ్చారా.? రంగులు వేశారా.?
- కబ్జా స్థలంలో అక్రమ కట్టడాలకు విద్యుత్ మీటర్లు ఎంత లంచం తీసుకొని ఇచ్చారు.?
- ఆర్ఐ, ఎమ్మార్వో పాత్రపైనా ఏసీబీ విచారణ జరపాలి
- విధినిర్వహణలో విఫలమైన మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్





జవహర్ నగర్ (ప్రశ్న న్యూస్) జవహర్‌నగర్ భూవ్యవహారంపై గతంలో వెలువడిన వార్తలు, స్థానికుల నుంచి అందుతున్న ఫిర్యాదులు చూస్తుంటే అక్కడ భూముల వ్యవహారం ఏ స్థాయిలో సాగుతోందో అర్థమవుతోంది. అక్రమ నిర్మాణాలపై కథనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు కనీసం క్షేత్రస్థాయిలో కొలతలు చేపట్టి వాస్తవాలను నిర్ధారించారా.? అన్న ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. మరోవైపు నిర్మాణాలు మాత్రం పూర్తయ్యాయని, ప్రారంభోత్సవాలు సైతం నిర్వహించి వాటిలో నివాసాలు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



అక్రమ నిర్మాణాల్లో నివాసాలు.. వాహనాలే స్థాయిని చెబుతున్నాయా.?

అక్కడ నిర్మాణాలు చేపట్టిన వారు నిజంగా పేదవారా.? లేక భూముల వ్యవహారంలో పెద్దల అండదండలతో ముందుకు సాగుతున్నారా.? అనే సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ఆయా నిర్మాణాల వద్ద నిలిపి ఉంచిన వాహనాలను పరిశీలిస్తే అక్కడ నివసిస్తున్న వారి ఆర్థిక స్థితిగతులపై కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. పేదల పేరుతో భూములు, నిర్మాణాల వ్యవహారాలు సాగుతున్నాయా? లేక దీని వెనుక పెద్దల ప్రమేయం ఉందా? అన్న కోణంలోనూ విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ రికార్డుల్లో లేని భూములకు విద్యుత్ మీటర్లు ఎలా?

మరోవైపు భూముల హక్కులు, నిర్మాణ అనుమతులపై స్పష్టత లేని ప్రాంతాల్లో పునాదులు వేసి నిర్మాణాలు చేపట్టిన వారికి విద్యుత్ కనెక్షన్లు ఎలా మంజూరయ్యాయన్నది మరో కీలక ప్రశ్నగా మారింది. సంబంధిత భూములకు సంబంధించిన హక్కు పత్రాలు, నిర్మాణ అనుమతులు పరిశీలించకుండానే విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేశారా? విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ట్రాన్స్‌కో అధికారులు అనుసరించిన నిబంధనలు ఏమిటి? దరఖాస్తులను ఏయే పత్రాల ఆధారంగా ఆమోదించారు? అనే అంశాలపై ట్రాన్స్‌కో అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

ఆర్ఐ, ఎమ్మార్వో పాత్రపైనా కలెక్టర్ విచారణ చేయాలి



ఈ భూవ్యవహారం వెనుక స్థానిక రెవెన్యూ సిబ్బంది పాత్ర ఏమైనా ఉందా.? ఆర్ఐ, ఎమ్మార్వో కార్యాలయాల పరిధిలో జరిగిన పరిణామాలపై సమగ్ర విచారణ జరిగిందా? అక్రమ నిర్మాణాల సమాచారం అందినప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యమా.? లేక తెరవెనుక ఏదైనా నెట్‌వర్క్ పనిచేస్తోందా.? అన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది.

జిల్లా కలెక్టర్ స్పందించేనా.?



ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి జవహర్‌నగర్‌లోని వివాదాస్పద భూములు, నిర్మాణాలపై సమగ్ర విచారణకు ఆదేశించాలని స్థానికులు కోరుతున్నారు. సర్వే నంబర్లు 499, 500లో భూముల అసలు హక్కులను నిర్ధారించడంతో పాటు అక్రమ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో కొలతలు వేసి, నిర్మాణ అనుమతులు, విద్యుత్ కనెక్షన్లు, రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టప్రకారం చర్యలు తీసుకుని భూదందా మూలాలను కూకటివేళ్లతో పెకిలించాలని స్థానికులు కోరుతున్నారు.

అందుబాటులో ఉండాలి
మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజు ఓపీకి ఎంత మంది వస్తారని ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో ఓపీ రిజిస్టర్, ల్యాబ్, వ్యాక్సిన్లు, ఇమ్యూనైజేషన్ గది, ఇన్ పేషెంట్ గదులు, ఇతర గదులు, ఫార్మసీ, ఆసుపత్రి ఆవరణలో పరిశీలించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఏ.ఎన్.ఎం. లతో మాట్లాడి క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఏ.ఎన్.సీ రిజిస్ట్రేషన్లు, గర్భిణీల ఆరోగ్య విషయాలపై దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేలా కృషి చేయాలని అన్నారు.ఎన్.సీ.డీ స్క్రీనింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీని ద్వారా ముందు గానే వ్యాధి లక్షణాలను గుర్తించి, అవసరమైన చికిత్స అందించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణం, పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికై
ఈఎస్ఐ ఉద్యోగుల నిరసన



నాచారం (ప్రశ్న కా న్యూస్) ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా నేడు రాష్ట్రవ్యాప్తంగా ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీలు,డయాగ్నోస్టిక్ సెంటర్లలో పనిచేస్తున్న ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలతో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఈఎస్ఐ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు మాట్లాడుతూ తమ ముఖ్యమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా సొసైటీ ప్రతిపాదనను విరమించుకోవాలని, రామచంద్రాపురం, నాచారం ఈఎస్ఐ ఆసుపత్రులను తీసుకోవాలనే ప్రతిపాదనలను ఈఎస్ఐసి విరమించుకోవాలని, రెగ్యులర్ డైరెక్టర్ గా డాక్టర్ ను నియమించాలని, అన్ని విభాగాల్లో ప్రమోషన్లను చేపట్టాలని, అలాగే అన్ని విభాగాల్లో ఖాళీల భర్తీకి రిక్రూట్మెంట్ చేపట్టాలని, ఈఎస్ఐ కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రతి నెల ఒకటవ తేదీననే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బరితెగించి రెచ్చిపోతున్న ఇసుకాసురులు

- అక్రమార్కులకు అడ్డు వెళితే వేధింపులు, సస్పెన్షన్లు - కష్టాల కడలిలో ప్రమాదానికి గురి అయిన పోలీసులు
- సిరిసిల్ల నియోజకవర్గంలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా కు అడ్డుకట్ట ఎప్పుడు.?

(దుర్గం విజయ్ బాబు -ప్రశ్న న్యూస్ బ్యూరో)



తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయి. అధికారులు మారుతున్నారు. కానీ మాఫియాలు, అక్రమార్కులు మాత్రం మారడం లేదు ఏ ప్రభుత్వమైనా వారి అక్రమాలకు అడ్డుకట్ట వేసే పరిస్థితి లేదు. ఎందుకంటే ఈ మాఫియా నడిపిస్తుంది రాష్ట్ర ముఖ్య నాయకులతోపాటు చోటామోటా లీడర్లే కాబట్టి. అందిన కాడికి దోచుకోవడం అడ్డుకున్న వారిని అంతం చేయడానికి కూడా వెనుకాడకపోవడం. ఆ అక్రమ ఇసుక, మట్టి దందాలో దొరుకుతున్న ఆదాయం అంతా ఇంతా కాదు కాబట్టి ఎంతకైనా తెగిస్తున్నారు. కోట్ల ఆదాయం ఏ ప్రభుత్వం వచ్చిన ఏ అధికారి వచ్చిన వాళ్ళ మాట వినాల్సిందే.

అక్రమార్కులకు అడ్డు వెళితే వేధింపులు, సస్పెన్షన్లు లేదా ఖతం

సిరిసిల్ల నియోజకవర్గం గంభీరావుపేట పోలీస్ స్టేషన్ లో పని చేసిన ఎస్ఐ సిహెచ్ శ్రీకాంత్ సస్పెన్షన్ వెనుక ఇసుక మాఫియా పకడ్బందీ పన్నాగం ఉందని మండల ప్రజలు, పాత్రికేయులు బహిరంగనే ఆరోపించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేయడంతో కక్షగట్టి వేధింపులకు గురిచేశారు. సస్పెన్షన్ అయ్యేంతవరకు పకడ్బందీగా వ్యవహరించారు. ఇసుక మాఫియాను అడ్డుకునే ఎస్ఐ పైనే ఇంత పగ సాధించారు అంటే ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటి.? ఇక ఇసుక మాఫియా పై వార్తలు రాసే రిపోర్టర్ల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ప్రజలు, పోలీసు బాసులు అర్థం చేసుకోవాలి. ఇసుక ఆగడాలు పోలీసు శాఖలో ఉన్నత అధికారులు ఈ పరిస్థితి తెలిసి మౌనంగా ఉండడం వెనుక అంతర్యం ఏమిటి.?గంభీరావుపేట ఎస్.ఐ శ్రీకాంత్ ని లక్ష్యంగా చేసుకొని అసత్య ప్రచారాలు చేస్తూ ఓ పత్రికలో వరుస కథనాలు వచ్చిన నేపథ్యంలో గంభీరావుపేట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది. అనంతరం వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో థర్డ్ డిగ్రీ ప్రయోగించి రిమాండ్ కి తరలించారని ఎస్ఐ శ్రీకాంత్ పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్ కు గురిఅయ్యారు. ఎస్సై శ్రీకాంత్ సస్పెన్షన్ వేటు పడడంతో ఇసుక మాఫియా సభ్యులు రెచ్చిపోతున్నారు. ఉన్నత అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఇసుక మాఫియా రెచ్చిపోవడం ప్రారంభించింది. చివరకు పోలీసు సిబ్బందిని కూడా లెక్క చయడం లేదు చివరికి ఓ కానిస్టేబుల్ ను ఢీ కొట్టి వెళ్లారు. అంటే మాఫియా ఏ స్థాయిలో రెచ్చిపోతుందో అర్థం చేసుకోవచ్చు దీని వెనక బడా బాబుల హస్తం లేకపోలేదు.

ప్రాణపాయ స్థితిలో ఉన్న కానిస్టేబుల్ ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



ఇసుక మాఫియా ఆగడాలకు బలి అవుతున్న కానిస్టేబుళ్లు

గత సంవత్సరం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణ అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించే క్రమంలో అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ కానిస్టేబుల్ ట్రాక్టర్ పైనే ఉండగానే కిందికి దుంకడంతో ట్రాక్టర్ చెరువులో పడి కానిస్టేబుల్ సత్యనారాయణ నడుం విరిగింది. చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న కానిస్టేబుల్ సత్యనారాయణకు మెరుగైన చికిత్స చేయించారు. నడుము విరిగిన కానిస్టేబుల్ సత్యనారాయణ ఇప్పటికి బాధతో విలవిలలాడుతున్నాడు. ఇప్పుడు మరో కానిస్టేబుల్ రమేష్ కు కాలు చేతుకు తీవ్ర గాయాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇసుక మాఫియా చేతిలో బలై వాళ్లు చేసే ప్రమాదానికి గురి అయిన పోలీసుల కుటుంబాలు ఎన్నో నరకయాతన అనుభవిస్తున్నారు.

హక్కుల సంఘాల పేరుతో ఆందోళన బాధాకరం

పౌరుల కోసం భారత రాజ్యాంగంలో, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల్లో ఎన్నో రక్షణలు ఉన్నాయి. అధికారులు తమ విధి తమ నిర్వహిస్తూ ఉంటే, అక్రమాలకు పాల్పడేవారు కక్షగట్టి వేధింపులకు గురి చేస్తూ, విషపు రాతలతో ఇబ్బందులకు గురి చేపిస్తే అరెస్టు చేయాలా వద్దా అని పోలీసులు ప్రశ్నించారు. అరెస్టు చేస్తే తప్ప అని కొంతమంది పోలీసులు ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సంఘాల పేరుతో ఆందోళన చేయడం ఇంతవరకు సమంజసం అంటూ ప్రశ్నించారు. ఆందోళన చేయడం వల్ల ఎస్సై శ్రీకాంత్ ని సస్పెన్షన్ చేస్తారు. కానీ ఇసుక మాఫియా రెచ్చిపోయి ప్రజల, పోలీసుల ప్రాణాలు కూడా తీస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సంఘాల పేరుతో అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నత అధికారులు సిరిసిల్లలో పోలీసుల, ప్రజల ప్రాణాలను తీస్తున్న ఇసుక మాఫియాని కట్టడి చేస్తారో లేక రాజకీయ నాయకుల హస్తం ఉందంటూ మౌనంగా ఉండిపోతారో వేచి చూడాలి.



నచ్చిన నంబర్ కావాలంటే
ఇక స్పీడ్ పెంచాల్సిందే

- తెలంగాణ రవాణా శాఖ కీలక నిర్ణయం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నచ్చిన ఫ్యాన్సీ నంబర్ కోసం కొత్త వాహనాలకు నెలల తరబడి శాశ్వత రిజిస్ట్రేషన్ చేయకుండా తిప్పే ఆటలకు తెలంగాణ రవాణా శాఖ గట్టిగా అడ్డుకట్ట వేసింది. తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్) తీసుకున్న తర్వాత రోడ్లపై తిరుగుతూ కాలయాపన చేసే ధోరణిని అరికట్టేందుకు తాజాగా నిబంధనలను కఠినతరం చేసింది. ఇప్పటివరకు ఫ్యాన్సీ నంబర్ ఎంపిక కోసం కల్పించిన రెండు నెలల సుదీర్ఘ గడువును సగానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇకపై నెల రోజుల్లోపే ప్రక్రియ మొత్తం తేల్చుకోవాలని స్పష్టం చేస్తూ జారీ చేసిన నూతన ఉత్తర్వులు బుధవారం నుంచే అమల్లోకి వచ్చాయి. కొత్త నిబంధనల ప్రకారం తాత్కాలిక రిజిస్ట్రేషన్ జారీ అయిన తేదీ మొదలుకొని సరిగ్గా 30 రోజుల్లోనే నిర్దేశిత నంబర్ రిజర్వేషన్, ఆన్‌లైన్ బిడ్డింగ్, ఫీజుల చెల్లింపు వ్యవహారాలన్నీ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఆ గడువు దాటితే వాహనదారుడికి ఎలాంటి ప్రత్యేక హక్కులు ఉండవు. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ దానంతట అదే ఒక సాధారణ ర్యాండమ్ నంబర్‌ను కేటాయించేస్తుంది. ఆ తర్వాత ఇక ఫ్యాన్సీ నంబర్ మార్చుకునే అవకాశం ఉండదు. షోరూమ్‌లో బండి డెలివరీ ఇచ్చే సమయంలోనే ఈ కొత్త నిబంధనల గురించి కొనుగోలుదారులకు వివరంగా చెప్పాలని డీలర్లను రవాణా శాఖ అప్రమత్తం చేసింది. గతంలో 60 రోజుల వెసులుబాటు ఉండటంతో చాలామంది టీఆర్ నంబర్లతోనే దర్జాగా రోడ్లపై వాహనాలను నడిపేవారు. దీనివల్ల నగరాల్లో ట్రాఫిక్, క్రైమ్ పరంగా భద్రతా సమస్యలు తలెత్తడంతో పాటు తదుపరి సిరీస్ నంబర్ల ప్రక్రియ నిలిచిపోయేది. ఈ గడువును నెల రోజులకు తగ్గించడం వల్ల శాశ్వత నంబర్ల కేటాయింపు వేగవంతం కావడమే కాకుండా, బిడ్డింగ్‌లో మరింత పారదర్శకత వచ్చి ప్రభుత్వానికి సకాలంలో ఆదాయం చేరుతుందని రవాణా కమిషనర్ కార్యాలయం వెల్లడించింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588